

కమ్యూనిస్టు దిగ్గజం స్టాలిన్‌బాబు ఇక లేరు
● నేడు గుంటూరులో అంత్యక్రియలు 8

అమరావతి - బెల్లంకొండ రహదారికి రూ.25 కోట్లు మంజూరు

27 నుంచి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు 6

ఏఎన్‌యూ తాత్కాలిక వీసీగా గంగాధరరావు

పట్టాలెక్కనున్న అమృత్ 2.0



నరసరావుపేటలోని కత్తవ చెరువు

చేపట్టాల్సిన పనులు ఇలా..

- నీటి పథకాల విస్తరణ, చెరువుల అధునికీకరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం.
- రానున్న 25 ఏళ్లలో పెరిగే జనాభాకు అనుగుణంగా తాగు నీటి పథకాల విస్తరణ.
- 24/7 నీటిని సరఫరా చేసే దిశగా నీటి పథకాల అభివృద్ధి, మురుగునీటి సమస్యలపై దృష్టి సారించడం.
- పట్టణాల్లో భూగర్భ జలాల పెంపు, చెరువుల పూడిక తీత, కట్టల పటిష్టత, వీటిపై వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం.
- పట్టణాల్లో వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన సెంటు స్థలం కాలనీలకు తాగు నీటి సరఫరా, పైపులైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, గృహాలకు కుళాయి కనెక్షన్‌లు.

మున్సిపాల్టీల వారీగా అమృత్ 2.0 నిధులు ఇలా..

మున్సిపాల్టీ	నిధులు (కోట్లలో)
నరసరావుపేట	29.42
చిలకలూరిపేట	161.30
దాచేపల్లి	49.62
పిడుగురాళ్ల	36.26
గురజాల	18.62
సత్తెనపల్లి	0.72
మాచర్ల	37.53
గుంటూరు	381.03
మంగళగిరి,తాడేపల్లి	68.21
తెనాలి	61.61
పొన్నూరు	22.10
చీరాల	32.98
బాపట్ల	25.32
రేపల్లె	45.74
అద్దంకి	5.10

పురపాలక సంఘాల్లో అమృత్ 2.0 పథకం పనులు పట్టాలెక్కనున్నాయి. రెండు సార్లు వాయిదా పడిన టెండర్లు ఎట్టకేలకు తిరిగి నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో టెండర్లు నిర్వహించేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. రానున్న నాలుగు రోజుల్లో టెండర్లు నిర్వహించ నున్నట్లు సదరు అధికారులు తెలిపారు. రూ.975.56 కోట్లు వ్యయంతో పనులు చేపట్టనున్నారు. పనులకు వినియోగించే మెటీరియల్ కొత్త ప్రామాణిక రేట్లు ప్రకారం టెండర్ నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

- టెండర్ నిర్వహణకు అనుమతి
- రూ.975.56 కోట్లతో పనులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని గుంటూరు నగరంతో సహా మునిసిపాల్టీల్లో అమృత్ పథకం కింది 54 పనులకు రూ.975.56 కోట్ల వ్యయం చేయనున్నారు. ఈ పనులన్నింటిని ఒకే టెండర్ కింద (మిగతా 6వ పేజీలో)



అమృత్ పథకంలో ప్రతిపాదించిన పిడుగురాళ్ల చెరువు



వేమూరు: బూతుమల్లిలో నీట మునిగిన వరి పైరు



దాచేపల్లి: మాదినపాడులో మిర్చి పొలంలో నిలిచిన వర్షపు నీరు

ఎండ.. వాన

కళ్లు చెదిరేలా ఎండ.. అంతలోనే నల్లని కారు మబ్బులు కమ్మేయడం. ఆపై ఆకాశం గర్జించినట్లు మేఘాలు నీటిని కుమ్మరిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఈ విచిత్ర పరిస్థితి గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అత్యధికంగా పల్నాడు జిల్లాలో అక్కడక్కడ కనిపించింది. శుక్రవారం కూడా పలు ప్రాంతాల్లో ఇదే విధంగా ఎండ మండించగా అంతలోనే భారీగా వర్షం పడింది. మళ్లీ అంతలోనే వర్షం ఆగిపోగా సూర్యుడు దర్శనమిచ్చాడు. క్లౌడ్ బరెస్ట్ అయిందా అన్నట్లు అక్కడక్కడ భారీగా వర్షం పడింది. వాన పడదని బయటకు వచ్చిన ప్రజలు కుంభవృష్టిలా పడిన చినుకులతో తడిసిముద్దయ్యారు. వర్షంతో కొన్ని ప్రాంతాల్లోని వీధులు చెరువుల్లా మారగా మరికొంత దూరంలో ఆ ఆనవాళ్లు లేవు. ఈ విచిత్ర పరిణామాలతో రైతులు నిండిముని గారు. చేతికంది వచ్చిన వరి, పత్తి తదితర పంటలు నీట మునిగాయి. కొన్ని రోజులుగా కురుస్తోన్న వర్షాలతో దిగుబడులు తగ్గిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- క్లౌడ్ బరస్ట్‌ను తలపించేలా వానలు
- వరి పైరుకు రోజురోజుకు పెరుగుతున్న నష్టం
- 27నుంచి మళ్లీ వర్షాల హెచ్చరికతో రైతుల్లో వణుకు
- నిజాంపట్నంలో కొనసాగుతున్న మూడో నెంబరు హెచ్చరిక

నరసరావుపేట, దాచేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో శుక్రవారం కూడా కొన్ని ప్రాంతాల్లో వర్షం పడింది. మరికొన్ని ప్రాంతాల్లో ఎండ కాసింది. మూడు రోజులుగా వదలకుండా వర్షం పడగా శుక్రవారం ఉదయం సూర్యుడు కనిపించాడు. దీంతో వర్షం పోయిందని రైతులు సంతోషించారు. పంట నష్టం కొంత తగ్గుతుందని ఆశపడ్డారు. అయితే వారి సంతోషం క్షణకాలం కూడా నిలువలేదు. ఎండ వచ్చిందనుకునేలోపే భారీగా వర్షం పడింది. శుక్రవారం సాయంత్రం వరకు ఇదే తరహా పరిస్థితి కనిపించింది. మధ్యాహ్నం లోపు కురిసిన వర్షాలకు పట్టణాలు, గ్రామాలు (మిగతా 8వ పేజీలో)



పెదనందిపాడు వద్ద మిరప పైర్లో నిలిచిన వర్షపు నీరు

తాగునీటి పథకాలను పూర్తి చేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ కృతికాశుక్లా

నరసరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన తాగునీటి పథకాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖలతో కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం, జడ్పీ నిధులతో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో చేపట్టిన మౌలిక వసతులను వెంటనే పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో జరిగే పనులను సంబంధిత హెచ్‌ఓడీలు, జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ పరిశీలించాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ పనుల పురోగతిని సమీక్షించడంతో పాటు క్షేత్రస్థాయిలో నాణ్యతను పరిశీలించాలన్నారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలు, మరమ్మతులను పూర్తి చేయాలన్నారు. 15 ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీ రాజ్ శాఖ చేపట్టిన పనులను వచ్చే నెల లోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈలు కె.ముత్తయ్య, సంపత్‌కుమార్, గ్రామీణ నీటి సరఫరా విభాగం జిల్లా అధికారి టి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

32 బైకులు, 2 గొడ్డళ్లు స్వాధీనం

వడ్డెరపాలెంలో పోలీసుల కార్డెన్‌సెర్చ్

మాచర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సరైన పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలు, ఆటో, 2 గొడ్డళ్లు, 2 కర్రలు, 2 ఐరన్ పైపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని పాతూరు వడ్డెరపాలెంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గురజాల ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, పది మంది ఎస్‌ఐలు, 80 మంది పోలీసులతో కార్డెన్‌సెర్చ్ జరిగింది. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్లో సీఐ తురకా వెంకటరమణతో కలిసి డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు. నేర నియంత్రణ చట్టం - సమాధానం పరిరక్షణ దిశగా పోలీసు విభాగం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. పట్టణంలో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, అద్దె గృహాలు, వ్యసనపరులు, క్రిమినల్ రికార్డు ఉన్న వారిని క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు చెప్పారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని గుర్తించిన వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. చట్టం ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్డెన్‌సెర్చ్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, ఇతర సామగ్రిని స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ నెల 27న సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.



ద్విచక్ర వాహనాలతో ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటరమణ, సిబ్బంది



2024లో చిలకలూరిపేట వద్ద జరిగిన బస్సు ప్రమాదం (పాత చిత్రం)

ట్రావెల్స్.. టెర్రర్

కర్నూలు ఘటనతో ఉలికిపాటు ● బస్సు ప్రయాణంపై భయాందోళనలు

చిలకలూరిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆకర్షణీయ రంగులు, విద్యుత్ దీపాల వెలుగుల్లో కనిపించే ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణాలపై భయాందోళనలు నెలకొంటున్నాయి. గతంలో ఎన్నో ఘటనలు చోటు చేసుకున్నా అటు ట్రావెల్స్ నిర్వాహకులు.. ఇటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. కర్నూలు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న బస్సు దహనం ఘటన నిదర్శనంగా కనిపిస్తోంది. రైళ్లలో రిజర్వేషన్లు దొరక్క, ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేక పోవడంతో ఎక్కువమంది ట్రావెల్స్‌పై ప్రయాణాలకు మొగ్గుచూపుతున్నారు. ఇదే అదునుగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం నగరాలకు ట్రావెల్స్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతున్నారు.

తప్పించుకునే అవకాశం మృగ్యం..

ట్రావెల్స్ బస్సుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే తప్పించుకునే అవకాశం ఉండటంలేదు. దీంతో ప్రయాణికులు బస్సులోనే సజీవ దహనం అవుతున్న సంఘటనలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. 2024 మే 15 తెల్లవారుజామున చీరాల నుంచి హైదరాబాదు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు పర్చూరు చిలకలూరిపేట మధ్య టిప్పర్ లారీ ఢీకొట్టి మంటలు చెలరేగి ఆరుగురు సజీవ దహనమయ్యారు. తాజాగా కర్నూలులో జరిగిన ఘటనలో 20 మంది సీట్లలోనే కాలిపోయారు. ఇలా ప్రమాదాలు జరిగినప్పుడు బస్సులో పొగలు వ్యాపించి ఎటు వెళ్లాలో, ఎలా తప్పించుకోవాలో తెలియని పరిస్థితుల్లో మంటల్లో మాడిమసైపోతున్నారు. ఎమర్జెన్సీ డోర్‌లో నుంచి అందరూ తప్పించుకోలేకపోతున్నారు. దీంతో మహిళలు, పిల్లలు, వృద్ధులు మృతి చెందుతున్నారు. అద్దాలు పగలగొట్టడానికి కావాల్సిన పరికరాలు అందుబాటులో లేకపోవడం కూడా మృతుల సంఖ్య పెరగడానికి కారణమని తెలుస్తుంది.

పత్తి కొనుగోళ్లపై అవగాహన కల్పించాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ కృతికాశుక్లా

నరసరావుపేట రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్ల నిబంధ నలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశించారు. పత్తి కొనుగోళ్ల ప్రక్రియపై కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీఐ కేంద్రాలకు వెళ్లకముందే ఆమోదయోగ్యమైన తేమ శాతం గురించి రైతులకు తెలియజేయాలన్నారు. రైతుసేవా కేంద్రాల వద్దే తేమశాతం చూసి కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకువెళ్లాలా, లేదా అనే విషయంపై రైతులకు స్పష్టత ఇవ్వాలన్నారు. మండలాల వారీగా పత్తి ఉత్పత్తి అంచనా వివరాలను సీసీఐకి అందించాలని వ్యవసాయశాఖ అధికారి జగ్గారావుని ఆదేశించారు. హెక్టారుకు 15 క్వింటాళ్ల కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు తెలిపారు. కిసాన్, సీఎం యాప్‌లలో రిజిస్ట్రేషన్ ఆధారంగా కొనుగోళ్ల చేస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ సూరజ్‌ధనుంజయ్, మార్కెటింగ్ అధికారి ఉపేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

కొండ్రముట్లలో విద్యాశక్తి పరిశీలనలో డీఈవో

ఈపూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులకు డీఈవో ఎల్ చంద్రకళ సూచించారు. మండలంలోని కొండ్రముట్ల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న విద్యాశక్తి కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల సమయం తర్వాత పదో తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న అదనపు శిక్షణ తరగతులను పక్కాగా నిర్వహించాలన్నారు. విద్యాశక్తి కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. గణితం, సైన్స్, ఇంగ్లీషు ఉపాధ్యా యులకు ఐఐటీ మద్రాసు భాగస్వామ్యంతో నిపుణులైన అధ్యాపకులతో జరుగుతున్న బోధన గురించి విద్యార్థులను డీఈవో ప్రశ్నించారు. పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఏమి ప్రణాళిక రూపొందించారని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

కస్తూర్బా విద్యాలయంలో తనిఖీ..

బొల్లాపల్లి: బొల్లాపల్లిలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని డీఈవో చంద్రకళ శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పది, ఆరో తరగతి విద్యార్థుల విద్యా స్థాయిలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట ఎంఈవో పార్వతి ఉన్నారు.



కస్తూర్బా విద్యాలయంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

కల్తీ మద్యం లేకుండా చేయడమే లక్ష్యం

ఎక్సైజ్ సురక్ష యాప్ అవగాహనలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. వినుకొండలో శుక్రవారం ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి సురక్ష యాప్‌పై జీవీ అవగాహన కల్పించారు. దుకాణదారులు స్కాన్ చేసి మద్యం విక్రయిస్తున్నారా? యాప్‌లో వివరాలు నమోదవుతున్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యాన్ని ప్రోత్సహించినా, విక్రయించినా ఏ స్థాయిలో వ్యక్తులైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని మద్యం దుకాణాలు, బార్లలో సురక్ష యాప్ ద్వారా బాటిళ్లను స్కాన్ చేసి విక్రయించాలన్నారు. వినియోగదారులు సురక్ష యాప్‌ను ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని మద్యం సీసాలపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అసలుదా? నకిలీదా? తెలుసుకోవచ్చన్నారు. వినియోగదారులకు నాణ్యమైన మద్యం అందజేయడం, కల్తీ లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారిందని ఆరోపించారు. జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి 27 మంది మరణిస్తే జగన్ ప్రభుత్వం కనీసం విచారణ కూడా జరపకుండా కేసును తప్పుదారి పట్టించి చర్యలు తీసుకోలేదన్నారు. తెలంగాణ నుంచి నాటుసారా తీసుకొచ్చి మాచర్లలో విక్రయించినప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదని వైసీపీ నేతలను ప్రశ్నించారు. వైసీపీ పాలనలో ఏపీని అనారోగ్యాంధ్రప్రదేశ్‌గా చేశారని, కూటమి ప్రభుత్వం కల్తీ మద్యాన్ని అరికట్టి ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా చేయాలనే లక్ష్యంతో చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలను పెంచాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



యాప్ అవగాహనను పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

27 నుంచి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు

గుంటూరు(క్రీడలు) అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి నవంబరు 3 వరకు అండర్ 19 బాల బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి నరసింహారావు పేర్కొన్నారు. యోగ పోటీలు ఈనెల 27న రావెల జిల్లా పరిషత్ పాఠశాలలో, క్యారమ్స్, త్రో బాల్, రోప్ స్కిప్పింగ్ పోటీలు 28న చుండూరు ఏపీ ఎస్ డబ్ల్యూ ఆర్ జూనియర్ కళాశాల లో, హాకీ, టెన్నికాయిట్ పోటీలు 29న నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నవంబర్ 1న దుర్గి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, హ్యాండ్ బాల్ పోటీలు 3 న నరసరావుపేట సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో జరగనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు ఎంపికలకు హాజరు కావలసిందిగా కోరారు.

మిర్చి అమ్మకాలపై వాతావరణం ఎఫెక్ట్

● యార్డులో మూడు రోజులుగా పడిపోయిన కొనుగోళ్లు

● 50 శాతం వరకు తగ్గిన విక్రయాలు

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముసురు వాతావరణంతో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్చి యార్డులో లావాదేవీలు తగ్గాయి. గత మూడు రోజుల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. గత వారం వరకు రోజుకు 50 వేలకు పైగా మిర్చి టిక్కీలు విక్రయానికి రైతులు తీసుకురాగా.. దీపావళి పండగ సందర్భంగా నాలుగు సెలవు దినాలు రావడం, ఆ తర్వాత నిత్యం ముసురు వర్షం కురుస్తుండటంతో బయ్యర్లు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో దాదాపుగా సగానికి సగం శాతం మిర్చి అమ్మకాలు తగ్గాయి. మళ్లీ శని, ఆదివారం యార్డులో మిర్చి లావాదేవీలకు సెలవు దినాలు. ఈ నేపథ్యంలో వ్యాపారులంతా.. వచ్చే వారం నుంచి మార్కెట్ ఊపందుకోవాలని కోరుకొంటున్నారు. అయితే ఈ నెల 28వ తేదీ వరకు వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో ట్రేడర్ల ఆశలు తీరే పరిస్థితి కనిపించడం లేదు.

మిర్చికి ప్రస్తుతం అన్‌సీజన్ అయినప్పటికీ కోల్డ్‌స్టోరేజ్‌లలో ఉన్న నిల్వలు కారణంగా రోజుకు 50 వేలకు పైగా టిక్కీలను బయ్యర్లు కొనుగోలు చేసి ఎక్స్‌పోర్టు చేస్తున్నారు. దీంతో ధర కూడా మెల్లగా పెరుగుతోంది. క్వాలిటీ బాగా ఉన్న మిరపకాయలకు క్వింటా రూ.16 వేల వరకు ధర లభిస్తోంది. సీజన్‌లో కేవలం రూ. 8 వేల నుంచి రూ. 10 వేల మధ్యనే ధర వచ్చింది. ఈ నేపథ్యంలో కొంతలో కొంతైనా నిలదొక్కుకోగలుగుతున్నామని రైతులు భావిస్తున్నారు. అయితే వరుస సెలవుదినాలు, ముసురు వర్షం కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి సరుకు బయటకు తీయనీయకుండా ఆటంకాలు కలిగిస్తున్నాయి. ఒక పక్క డిసెంబరు నెల సమీపిస్తుండటం, మరోవైపు కోల్డ్‌స్టోరేజ్‌లలో ఇంకా 38 లక్షలకు పైగా మిర్చి టిక్కీలు నిల్వ ఉండడంతో.. రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇందుకు కారణం డిసెంబరు నుంచి కర్నూలు జిల్లా రైతులు కొత్త మిర్చి పంటని విక్రయానికి తీసుకురానున్నారు.

ఈ నెల 22న 31,782 మిర్చి టిక్కీలను రైతులు యార్డుకు తీసుకురాగా అందులో 29,896 విక్రయం జరిగాయి. 23న 35,492 టిక్కీలు తీసుకురాగా 36,297 టిక్కీలు అమ్ముడయ్యాయి. శుక్రవారం 38,284 టిక్కీలు తీసుకురాగా 34,239 విక్రయమయ్యాయి. గత కొన్ని వారాలతో పోల్చితే ఈ వారం కనీసం 2.50 లక్షల మిర్చి టిక్కీలు విక్రయం జరగాల్సి ఉంది. సెలవులు, వాతావరణంలో మార్పులు కారణంగా 90 వేల టిక్కీల విక్రయం మాత్రమే జరిగింది. దీని వలన కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వలు తగ్గడం లేదు. మరోవైపు మార్కెట్ ఫీజు వసూళ్ల పైనా ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది మిర్చి యార్డుకు మార్కెట్ ఫీజు రూపంలో రూ. 110 కోట్లకు పైగా టార్గెట్‌ని మార్కెటింగ్ శాఖ విధించింది. ఆ లక్ష్యానికి చేరుకోవాలంటే కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వలు విక్రయం జరగాలి. ఈ నేపథ్యంలో వాతావరణం అనుకూలించాలని అంతా కోరుకొంటున్నారు.

ఏఎన్‌యూ తాత్కాలిక వీసీగా కె.గంగాధరరావు బాధ్యతలు



తాత్కాలిక వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ఏఎన్‌యూ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మరోమారు తాత్కాలిక వీసీగా కె.గంగాధరరావును నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ శుక్రవారం ఏఎన్‌యూ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని రోజులుగా వర్సిటీకి వీసీ లేక ఎక్కడ వేసినా గొంగడి అక్కడే అన్న చందంగా పరిపాలన కొనసాగుతోంది. ముఖ్యమైన ఫైల్స్, జీతాలు ఆగిపోయాయి. ఎప్పుడూ లేని విధంగా వీసీ చాంబరుకు రాకపోకలు బంద్ అయ్యాయి. శాశ్వత వీసీగా ఎస్వీ సత్యనారాయణ రాజు బాధ్యతలు చేపట్టేందుకు సమయం పట్టే అవకాశం ఉన్నందున.. తాత్కాలిక వీసీ కోసం రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి కొన్ని రోజుల క్రితం ఉన్నత విద్యాశాఖకు లేఖ వెళ్లినట్లు సమాచారం. కె.గంగాధర్‌రావు తాత్కాలిక వీసీగా బాధ్యతలు చేపట్టారు. శాశ్వత వీసీ వచ్చేంత వరకు ఆయన ఆ పదవిలో కొనసాగుతారు. ఆగిపోయిన కొన్ని ముఖ్యమైన ఫైల్స్‌పై సంతకాలు చేసినట్లు సమాచారం. రెక్టార్ శివరామ్‌ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కావూరి శ్రీనివాసరావు, ఉన్నతాధికారులు వీసీకి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్ వైద్యం

● సమీక్ష సమావేశంలో తూర్పు ఎమ్మెల్యే నసీర్



సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, రమణ యశస్వి

గుంటూరు మెడికల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి మహర్దశ తీసుకువస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, జీజీహెచ్ అభివృద్ధి సంఘం కో-చైర్మన్ మొహమ్మద్ నసీర్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో వైద్యులు, విభాగాధిపతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్ వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సమావేశంలో.. వివిధ అంశాలను ఆయన సమీక్షించారు. ఆగస్టు సమీక్షలో విభాగాధిపతులు ఆసుపత్రికి కొన్ని వైద్య పరికరాలను సమకూర్చాలని కోరగా.. రాష్ట్రంలో ఇతర ఆసుపత్రులలో వాడకుండా నిరుపయోగంగా ఉన్న 21 వైద్య పరికరాలను ప్రభుత్వం ద్వారా గుంటూరు జీజీహెచ్‌కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, విభాగాధిపతులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులు ఎమ్మెల్యేకు పలు సమస్యలు వివరించారు. పరికరాలు, సిబ్బంది కొరత వంటి అంశాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై ఎమ్మెల్యే నసీర్ స్పందిస్తూ.. ఆసుపత్రిలో సమస్యలపై సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అత్యవసర విభాగంలో వచ్చే రోగులకు సత్వరం సేవలు అందించాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో అన్ని విభాగాల వైద్యులు ప్రణాళిక ద్వారా సజావుగా నడిచేలాగా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ అత్యవసర విభాగం నుంచి రోగుల్ని వార్డుకు తరలించేందుకు ఆరుగురిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర వైద్య విభాగాన్ని వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి సంఘం సభ్యులు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, కార్పొరేటర్ పోతురాజు సమత, వైద్యులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి వర్సిటీ ప్రధాన దారులన్నీ జలమయం



రోడ్డుపై నిలబడిపోయిన వర్షపు నీరు

ఏఎన్‌యూ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రధాన దారులన్నీ జలమయమయ్యాయి. చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. పరీక్ష భవనం, హిందీ విభాగం ఎదుట మోకాళ్ల లోతు నీరు నిల్వ ఉంటోంది. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోందని చెబుతున్నారు. రోడ్లకు ఇరువైపులా సైడ్ కాల్వలు నిర్మించి సమస్యను పపరిష్కరించాలని వారు కోరుతున్నారు. చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అమరావతి - బెల్లంకొండ రహదారికి రూ.25 కోట్లు మంజూరు



ఆర్థిక మంత్రి కేశవ్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్(ఫైల్ ఫోటో)

పెదకూరపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అమరావతి నుంచి బెల్లంకొండ రహదారి నిర్మాణానికి రూ.25 కోట్లు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం తెలిపారు. నెల రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్‌రెడ్డిని కలసి రహదారి నిర్మాణానికి నిధులను విడుదల చేయాలని కోరినట్లు వెల్లడించారు. దీంతో ప్రభుత్వం నిధులను విడుదల చేసిందని తెలిపారు. గత ప్రభుత్వం రహదారి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహించిందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలకు ఈ రహదారి ఎంతో అవసరమన్నారు. నిలిచిపోయిన అమరావతి నుంచి బెల్లంకొండ రహదారి నిర్మాణాన్ని త్వరలో ప్రారంభించి ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భాష్యం చెప్పారు.

డివైడర్ దాటుతూ లారీ కిందపడిన యువకుడు

● చికిత్స పొందుతూ మృతి



డివైడర్ దాటుతూ లారీ కింద పడిన ఉదయ్‌కిరణ్

కర్లపాలెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్లపాలెంలోని కిరణా వ్యాపారి మద్దుల భాస్కరరావు కుమారుడు ఉదయ్‌కిరణ్ కర్లపాలెం సెంటర్‌లో రోడ్డు డివైడర్ దాటుతూ ప్రమాదవశాత్తు లారీ వెనుక టైరు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. ఉదయ్ కిరణ్‌ను చికిత్స నిమిత్తం గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించగా.. శుక్రవారం సాయంత్రం అతను మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కొడుకులున్నారు. ఈ ఘటనపై కర్లపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు తీసుకొని.. మోసం చేశాడంటూ ఫిర్యాదు

బాపట్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం దేవినూతల గ్రామానికి చెందిన వల్లు రామకృష్ణ జేసీబీ స్టిక్ తయారీ కోసం నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన బొడ్డు ప్రకాష్‌కు రూ. 3.30 లక్షలు ఇచ్చాడు. ప్రకాష్ బాపట్ల చీలురోడ్డు సెంటర్‌లో వారంరోజులపాటు ఉండి తయారు చేస్తున్నానంటూ చెబుతూ సామాను తీసుకొని వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాకపోవటంతో శుక్రవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ సర్పంచ్‌కు జిల్లా పంచాయతీ అధికారి జారీ చేసిన షోకాజ్ నోటీసును ఈవోపీఆర్డీ విజయబాబు అందజేసినట్లు శుక్రవారం తెలిపారు. భట్టిప్రోలు గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు పలుమార్లు రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీలలో రూ.1.80 కోట్లు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. ఇందులో గ్రామ సర్పంచ్ దారా కిరణ్మయి రూ.60,09,386 నిధులు దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణ అయినట్లు అధికారులు తెలిపారు.

కొత్తలూరు వెళ్లే మార్గంలో దారిదోపిడీ

శావల్యాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ఒంటరిగా వెళ్తున్న వ్యక్తిని ఆపి దారిదోపిడీకి పాల్పడిన ఘటన శావల్యాపురం నుంచి కొత్తలూరు వెళ్లే మార్గంలో గురువారం రాత్రి జరిగింది. ద్విచక్ర వాహనదారుడి నుంచి బంగారం, నగదు అపహరించుకుపోయారు. స్థానికుల వివరాల ప్రకారం కొత్తలూరు గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి కోటేశ్వరరావు శావల్యాపురంలో సరుకులు తీసుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. మార్గ మధ్యంలో కొండవాగు మూల మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్ దాటుతుండగా వెనుక నుంచి ముగ్గురు ఒకే ద్విచక్ర వాహనంపై వచ్చి కోటేశ్వరరావును అడ్డగించారు. అతనిని బెదిరించి చేతికున్న రూ.లక్ష విలువజేసే ఉంగరం, మొబైల్‌ఫోన్‌ను, జేబులోని రూ.1000 నగదు లాక్కొన్నారు. కోటేశ్వరరావును ముగ్గురూ దాడి చేసి కొట్టారు. అతని ద్విచక్రవాహన తాళాన్ని తీసుకొని అక్కడి నుంచి ఉడాయించారు. కొంతసేపటికి తేరుకొన్న కోటేశ్వరరావు ఇంటికెళ్లి కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేశారు. శావల్యాపురంలోని పోలీస్ స్టేషన్‌కి చేరుకుని.. దారిదోపిడీపై ఫిర్యాదు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

పట్టాలెక్కనున్న అమృత్ 2.0

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తారు. అయా పనులు పూర్తి చేస్తే పురపాలక సంఘాల్లో తాగు, మురుగు నీటి కష్టాలు తీరుతాయి.

చామ్ పద్ధతిలో పనులు

రాష్ట్రంలోనే తొలిసారిగా అమృత్ పథకం 2.0 కింద ప్రగతి పనులను నూతన విధానంలో చేపనున్నారు. రాయితీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(చామ్) కింద పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానంలోనే టెండర్లు నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో వినియోగించిన పీపీపీ తరహాలోనే చామ్ విధానం కూడా ఉంది. 50 శాతం నిధులు ప్రభుత్వం ఇస్తుంది. 50 శాతం నిధులు కాంట్రాక్టర్ భరించాలి. సదరు సంస్థ ఖర్చు చేసే నిధులను వడ్డీతో కలిపి 40 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ ప్రతిపాదించిన పనులు స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. సదరు సంస్థ టెండరు దాఖలు చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు 15, 16 ఆర్థిక సంఘం నిధులు కూడా ఖర్చు చేస్తారు. మునిసిపాల్టీలు కూడా నిర్ణయించిన నిధులను వినియోగించాల్సి ఉంది.

38,284 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 34,239 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 38,284 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 5,224 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12500
334	10000	15200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	--	----	నెంబరు. 5	10000	14500
341	10000	15700	273	----	---
4884	---	----	341	10000	16000
సూపర్ 10	----	---	సూపర్ 10	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15100	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10500	15300	దేవనూరు డీలక్స్	10500	14600
దేవనూరు డీలక్స్	10000	14500	తాలుకాయలు	5000	8000

భార్యను చంపిన భర్తకు..

జీవిత ఖైదు, రూ.1000 జరిమానా

గుంటూరు(లీగల్), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భార్యను గొడ్డలితో నరికి చంపిన కేసులో నేరం రుజువురు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.1000ల జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.సాయి కల్యాణ చక్రవర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. సంతనూతలపాడు మండలం గురిజేపల్లికి చెందిన నిందితుడు నూతలపాటి వెంకటేశ్వర్లు తన భార్య నూతలపాటి మౌనికపై అనుమానం పెంచుకోవడంతో పాటు..తన తండ్రి వివాహ సమయంలో ఆమె పేరుపై రాసిన సెంటున్నర స్థలం తిరిగి ఇవ్వనన్నందుకు ఈ దారుణానికి ఒడిగట్టాడు. కూలి పనులు చేసుకుంటూ వట్టిచెరుకూరు మండలం సౌపాడు ఎస్సీ కాలనీలోని అత్తింటిలోనే వెంకటేశ్వర్లు భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. వీరిద్దరికీ ఇది మూడో వివాహం. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2017 జనవరి 9న అత్తమామలు పక్క ఊరికి పొలం పనులకు వెళ్లగా.. వెంకటేశ్వర్లు, మౌనికల మధ్య గొడవ జరిగింది. వెంకటేశ్వర్లు గొడ్డలితో మౌనిక తలపై నరకగా.. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో వెంకటేశ్వర్లు అక్కడి నుంచి పరారయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు మౌనిక మంచం మీద చనిపోయి ఉండటం చూశారు. మృతురాలి తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు వట్టిచెరుకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అదే నెల 12న నిందితుడుని అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. చేబ్రోలు సీఐ జి.రవికుమార్ కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాల ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎండీ బర్కత్ అలీ ఖాన్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

విద్యుత్ శాఖకు కోట్లల్లో బకాయిలు

● తల పట్టుకుంటున్న అధికారులు

దాచేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రూ.కోట్లల్లో ఉన్న బాకీలు వసూలు చేయటం విద్యుత్‌శాఖ అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రధానంగా వీధి లైట్లు, వాటర్‌స్కీమ్‌కు సంబంధించిన బిల్లులు రూ.కోట్లల్లో నిలిచిపోయాయి. మాచవరం మండలంలో రూ 3,14,70,893, దాచేపల్లి రూరల్‌లో రూ 6,59,12,459, దాచేపల్లి పట్టణంలో 6,10,09,341 బకాయిలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు అధికంగా ఉన్నాయి. దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయానికి రూ 5,95,126, మాచవరం తహసీల్దార్ కార్యాలయం 4,75,682, దాచేపల్లి పోలీసుస్టేషన్ 90,227, మాచవరం పోలీసుస్టేషన్ రూ 83,463 బకాయిలు పేరుకుపోయాయి. వీటితోపాటు పీహెచ్‌సీలు, ఆర్‌అండ్‌బీ బంగ్లా, ఇతర ప్రభుత్వకార్యాలయాల్లో బకాయిలు రూ.వేలల్లో సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. సకాలంలో ఆ శాఖల అధికారులు చెల్లిస్తే లక్ష్యాలను అధిగమించవచ్చని, ఆయా శాఖల అధికారులు సహకరించాలని కోరుతున్నారు.



చురుగ్గా జరుగుతున్న పనులు

సీఎం చంద్రబాబు రాకకు చురుగ్గా ఏర్పాట్లు

వెల్దుర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డి వివాహ వేడుకలకు ఈ నెల 27వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్దుర్తి రానుండడంతో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆ రోజున వర్షం పడినప్పటికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులను అధికారులు, టీడీపీ నేతలు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. రిసెప్షన్ జరిగే ప్రాంగణ సమీపంలో హెలిపాడ్ పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నారు.

27 నుంచి మంచినీటి సరఫరా నిలిపివేత

సత్తెనపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రక్షిత మంచినీటి పథకం సరఫరా ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో మరమ్మతులు చేయిస్తున్న దృష్ట్యా పట్టణంలోని 11 నుంచి 24 వార్డులకు అక్టోబరు 27, 28, 29 తేదీల్లో మంచినీటి సరఫరా నిలపివేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆయా వార్డుల ప్రజలు తగు నీటి నిల్వలు చేసుకొని పురపాలక సంఘానికి సహకరించాలన్నారు.

మాలధారణ స్వాములకు మహా సద్ది

దాచేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని శ్రీలక్ష్మీ రంగనాయక స్వామి దేవాలయంలో మాలధారణ స్వాములకు మహా సద్ది కార్యక్రమం జరుగుతోంది. 41 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి దాతల సహకారంతో రోజుకు 700 మంది స్వాములు సద్దికి హాజరవుతున్నారు. స్వామి వారి పీఠాన్ని ఏర్పాటుచేసి ప్రతి రోజు అభిషేకాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి కూటమి నేతలు తమ వంతుగా సహకరిస్తున్నారు.

సిమెంట్ బస్తాల అందజేత

పిడుగురాళ్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వీరాపురం గ్రామానికి చెందిన టీడీపీ నేత పర్వతనేని రామారావు గత పంచాయతీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం గ్రామంలో దిగువస్థాయి, మధ్యతరగతి వారు ఎవరైనా సొంత గృహనిర్మాణం చేపట్టేవారికి 50 సిమెంట్ బస్తాలను అందిస్తానన్న భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికి వీరాపురం గ్రామంలో పలువురికి సిమెంట్ బస్తాలను అందించిన ఆయన శుక్రవారం కొండ్రెడ్డి లక్ష్మీకి 50 సిమెంట్ బస్తాలను గ్రామ టీడీపీ నేతల సమక్షంలో అందించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 44.79 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 44,564 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, రెండు గేట్ల ద్వారా 35,098, మొత్తం 52,098 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించటం సరికాదు

రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సరైంది కాదని పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ సందెపోగు పున్నారావు అన్నారు. శుక్రవారం అచ్చంపేటలోని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమం ప్రారంభించినట్టు పున్నారావు తెలిపారు.

కేసు నమోదు

సత్తెనపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదలలో అప్పు నగదు చెల్లింపు విషయంలో ఒకే కమ్యూనిటీకి చెందిన ఇరువర్గాల మధ్య ఇటీవల వాగ్వాదం జరిగింది. ముందు జాగ్రత్త చర్యగా సత్తెనపల్లి రూరల్ సర్కిల్ సీఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ముప్పాళ్ళ పోలీసులు ఇరువర్గాలకు చెందిన 22 మందిపై శుక్రవారం కేసులు నమోదుచేశారు. గ్రామంలోని పలు గృహాల్లో డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

కండ్లకుంట, చాగల్లుకు ఆర్టీసీ బస్సు అదనపు ట్రిప్పులు

నకరికల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కండ్లకుంట, చాగల్లు గ్రామాలకు ఆర్టీసీ బస్సు అదనపు ట్రిప్పులు తిప్పటానికి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి తమ గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించినందుకు ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రిప్పులు పెంచటంతో రవాణా సౌకర్యం మెరుగైనట్టు ప్రజలు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

రాజుపాలెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు పత్తి, వరి పైరులలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో వెంకటనరసయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని రెడ్డిగూడెం, రాజుపాలెం గ్రామాలలో క్షేత్ర సందర్శనలో భాగంగా పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పత్తిపంటలో ప్రస్తుతం పూత, కాయ ఉందని పొలంలో నిల్వవున్న నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. వరి పైరు దుబ్బు, సుంకు దశలో ఉన్నందున పొలంలో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. తెగుళ్లు ఆశిస్తే నివారణపై అవగాహన కల్పించారు.

● నకరికల్లు: వరిలో ఆకు ఎండు తెగులు లక్షణాలు కన్పిస్తున్నాయని ఏవో కే దేవదాసు అన్నారు. నివారణకు ఎకరానికి 20 కేజీల మ్యూరేటా ఆఫ్ పొటాష్ ఎరువును వరి పంటలో పైపాటుగా చల్లుకోవాలని సూచించారు. పొలంలో ఉన్న నీటిని బయటకు పంపాలన్నారు. శుక్రవారం గుండ్లపల్లి, నరసింగపాడు, నకరికల్లు గ్రామాల్లో వరిపొలాలను ఆయన పరిశీలించారు. ఏఏలు ప్రియదర్శిని, సువిల, ముస్తక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గురజాలటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపాడు 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నూతన బ్రేకర్స్ ఎరెక్షన్ పనులు జరుగుతున్నందున శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రసాద్ తెలిపారు. రైతులకు ఉదయం 6 నుంచి 10గంటలవరకు 3ఫేజ్ విద్యుత్‌సరఫరా ఉంటుందన్నారు.

మాచర్ల రూరల్..

మండలంలోని అనుపు, కొప్పునూరు, పరాశక్తి ఫీడర్స్‌కు సంబంధించి విద్యుత్ లైన్ల మరమ్మతులను నిర్వహించనున్నట్లు డీఈఈ రామయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం 9నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు చెప్పారు. అనుపు, కొప్పునూరు లిఫ్ట్ ఇరిగేషన్‌లు, మాచర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించనున్నట్లు తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● డీఎం అండ్ హెచ్ఓ రవి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రవి

పిడుగురాళ్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్ర బలకుండా వుండేందు కు ప్రతి ఒక్కరు శుభ్రమైన నీటిని తాగడంతోపాటు పరిసర ప్రాం తాలను పరిశుభ్రంగా వుంచుకోవడమే పరిష్కారమార్గమని డీఎంఅండ్‌హెచ్ఓ రవి తెలిపారు. శుక్రవారం పాతగణేశునిపాడు గ్రామాన్ని సందర్శించి ప్రజలతో పరిశుభ్రత, ఆరోగ్య విషయాలపై, వైద్యసిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధుల గురించి, నీటి కలుషితం కారణంగా వచ్చే వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్, కామెర్ల వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. సాధువుల బజారులో ఆకస్మికంగా సందర్శించి పరిశుభ్రత గురించి అక్కడివారికి అవగాహన కల్పించారు. పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రత్నాకర్, ఎస్‌కే ఖలీం, ఆరోగ్య కార్యకర్తలు జాన్‌మీరా, రహీం, ఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సురక్షా యాప్‌తో నకిలీ మద్యం గుర్తింపు

● ఎక్సైజ్ సీఐ సోమయ్య

నకరికల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని ఎక్సైజ్ సీఐ కే సోమయ్య తెలిపారు. మద్యం అమ్మే షాపుల వద్ద ఈ యాప్ పోస్టర్లను అంటించారు. మొబైల్ ఉన్న వినియోగ దారులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయటం ద్వారా కొనుకున్న మద్యం నాణ్యమైనదా? కాదా? అని నిర్ధారించుకోవచ్చని తెలిపారు. శుక్రవారం రాత్రి మండలంలోని కుంకలగుంట, చల్లగుండ్ల, నకరికల్లు, గుండ్లపల్లి గ్రామాల్లోని బ్రాందీషాపుల వద్ద ఎక్సైజ్ సిబ్బందితో పోస్టర్లను అటించారు. మద్యం సేవించేవారికి గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొనేలా తెలిపారు. ఈ యాప్ ద్వారా మద్యం ఏ కంపెనీకి చెందింది, ఏ షాపులోనిది?, ఎంఆర్‌పీ ధర ఎంత వంటి వివరాలు తెలుసుకోవచ్చని వివరించారు. ప్రజలందరూ నకిలీ మద్యం బారినపడకుండా ఉండేందుకు ఎక్సైజ్‌శాఖ ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎక్సైజ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పెదకూరపాడు వైన్ షాపు వద్ద ఎక్సైజ్ సురక్షా పోస్టర్ల గురించి వివరిస్తున్న సీఐ బీ శ్రీనివాసులు

ఎక్సైజ్ సురక్షా యాప్‌పై మద్యం కొనుగోలుదారులకు అవగాహన

పెదకూరపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా మద్యం సీసాల హీల్స్‌ను స్కాన్ చేసి వెరిఫై చేయవచ్చని పెదకూరపాడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బీ శ్రీనివాసులు తెలిపారు. పెదకూరపాడు, అమరావతి మండలాల్లో శుక్రవారం ఈ యాప్ గురించి, పోస్టర్లు, స్టిక్కర్ల గురించి ఆయా గ్రామాల్లో వైన్ షాపుల వద్ద అంటించి మద్యం వినియోగదారులకు అవగాహన కల్పించారు. కొనుగోలు చేసిన మద్యం సీసాల వివరాలు, ధర, బ్యాచ్ నెంబరు, తయారీదారుల వివరాలను వారికి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ డీ పీరు హుస్సేన్, బీ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల కొష్టాలకు దరఖాస్తు చేసుకోవాలి

నకరికల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పశువుల షెడ్ల కోసం ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. ఉపాధి పథకం ద్వారా 90శాతం సబ్సిడీతో రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. రెండు పశువుల షెడ్డుకు రూ.1.15లక్షలు, 4 పశువుల షెడ్డుకు రూ.1.85 లక్షలు, 6 పశువుల షెడ్డుకు రూ 2లక్షలు యూనిట్ కాస్ట్‌గా ఉందన్నారు. మండలానికి 25 పశువుల షెడ్లకు పరిపాలన ఆమోదం ఉందని, ఆసక్తిగల రైతులు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వర్షాలకు జాగ్రత్తలు పాటించాలి

నకరికల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తడిచిన కరెంటు స్తంభాలను ముట్టుకోవద్దని విద్యుత్ ఏఈ జీ సుచరిత తెలిపారు. విద్యుత్ లైన్‌లకు చెట్టుకొమ్మలు తగిలినచోట చెట్లను తాకవద్దన్నారు. కరెంటు లైన్ కింద ఫోన్ మాట్లాడకూడదన్నారు. వర్షం పడుతున్న సమయంలో టీవీ, ఫ్రిజ్, మోటార్లు, కంప్యూటర్ స్విచ్‌లను ఆపివేయాలని, తీగలను పూర్తిగా తొలగించాలని, లేదంటే షార్ట్‌సర్క్యూట్ అయ్యే ప్రమాదముందన్నారు. ఉరుములు, మెరుపుల సమయంలో డిష్ కనెక్షన్ తొలగించాలన్నారు. ఇంట్లో వాటర్‌హీటర్ ప్లగ్ తీసిన తరువాతే నీటిని ముట్టుకోవాలన్నారు. విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు తప్పకపాటించాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నకరికల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ గంజాయి వంటి మత్తుపదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని నకరికల్లు ఎస్సై సతీష్ అన్నారు. శుక్రవారం రాత్రి చల్లగుండ్లలో పల్లెనిద్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సైబర్ నేరాలు, మోసాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజలు శాంతియుతంగా జీవించాలని సూచించారు.

సీఐ వెంకటరమణకు అభినందనలు

మాచర్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన టి.వెంకటరమణను శుక్రవారం జనసేన నేత, ప్రముఖ న్యాయవాది బత్తుల బాబురావు కలిసి అభినందనలు తెలిపారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజుపాలెం ఎంపీడీవోగా ప్రసాద్

రాజుపాలెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం మండ ల పరిషత్ కార్యాలయ నూతన పరిపాలన అధికారిగా మునగా ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ప్రసాద్ గుంటూరు జిల్లా సర్కిల్ ఏపీటీఐడీసీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

గుంటూరు కలెక్టర్‌ను కలసిన ఎమ్మెల్యే కన్నా



గుంటూరు జిల్లా కలెక్టర్‌ను కలసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తమీమ్ అన్సారియాను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం గుంటూరులోని కలెక్టరేట్‌లో కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

సామాజిక తనిఖీ రికవరీ సదస్సు

మాచర్ల రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా విజిలెన్స్ అధికారి హీరాలాల్ సామాజిక తనిఖీ రికవరీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం మొదలు నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న సామాజిక తనిఖీ రికవరీలు చెల్లించాలన్నారు. రికవరీ చెల్లించని వారిపై ఆర్ ఆర్ యాక్ట్ ద్వారా రికవరీ చేస్తామన్నారు. ఈ సదస్సులో ఏపీడీ జి.సత్యనారాయణ, ఏపీవో విజయకుమారి, ఎంపీడీవో ఫణికుమార్, ఏపీవో నాగ శ్రీనివాస్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సు నిర్వహిస్తున్న జిల్లా విజిలెన్స్ అధికారి హీరాలాల్

పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రాల ప్రారంభం



క్రోసూరు కేజీబీవీలో విద్యార్థులకు ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

క్రోసూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలంలోని పాఠశాలల్లో శుక్రవారం నుంచి ఆధార్ నమోదుకేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఆధార్‌కేంద్రంలో పేరు సవరణలు, పుట్టిన తేదీ, అడ్రస్ మార్పులు, ఫోటోమార్పులు, ఫోన్ నెంబరు, ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయనున్నట్టు ఎంఈవో జీ కృష్ణ తెలిపారు. శుక్రవారం కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు ఆధార్ నమోదు చేశారు. 25న దొడ్లేరు జడ్పీ, 27న క్రోసూరు మోడల్ స్కూల్, 28న హసానాబాద్ జడ్పీ, 29న గుడిపాడు, 30న నగవరం, 31న ఊటుకూరు, బయ్యవరం జడ్పీ పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలు పని చేస్తాయన్నారు. నవంబరు 1న అందుకూరు జడ్పీ, 3న క్రోసూరు జైభారత్ పబ్లిక్ స్కూల్, 4న సెయింట్ ఆన్స్ హైస్కూళ్ళలో ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తారన్నారు. వివరాలకు 9948413703 నెంబరులో సంప్రదించాలన్నారు. విద్యార్థులు తమ ఆధార్ కార్డులను పూర్తిస్థాయిలో అప్‌డేట్ చేసుకోవాలని ఆయన కోరారు.

నిలిచిన ఆధార్ ఎన్‌రోల్‌మెంట్

నకరికల్లు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోని విద్యార్థులకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయాలని ఎంపీడీవో జీ కాశయ్య ఈనెల 23, 24, 25 తేదీల్లో నకరికల్లు విశ్వశాంతి స్కూల్‌లో ఆధార్ ప్రత్యేక నమోదుకేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. కాగా 23, 24 తేదీల్లో ఆధార్ ప్రత్యేక శిబిరం మాత్రం నిర్వహించలేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ఆధార్ ప్రత్యేక నమోదును ఎప్పుడుచేస్తారో తెలపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాల్య వివాహాల వల్ల అనర్థాలపై అవగాహన కల్పించాలి



వైద్యుడు రవితేజనాయక్‌తో మాట్లాడుతున్న జిల్లా ఎన్‌సీడీసీడీ, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ స్వర్ణ రాజరాజేశ్వరి

రాజుపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహల వల్ల జరిగే అనర్థాలు, టీనేజ్ గర్భిణుల ఆరోగ్యసమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని జిల్లా ఎన్‌సీడీసీడీ, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ స్వర్ణ రాజరాజేశ్వరి కోరారు. రాజుపాలెం పీహెచ్‌సీని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన సేవలు ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు, ఆర్‌బీఎస్‌కే రికార్డులు, రోగులు, గర్భిణులకు అందుతున్న సే వలు, వైద్యశాలలో మందుల నిల్వ గురించి వైద్యుడు రవితేజ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిరోధక టీకాలను అందిస్తున్న తీరును పరిశీలించారు. సీహెచ్‌వో వసంతరావు, హెల్త్ విజిటర్ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా టీబీ అధికారి డాక్టర్ మాధవీలత

సత్తెనపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీబీ యూనిట్‌ను, ఎయిడ్స్ కంట్రోల్ కౌన్సెలింగ్ సెంటర్‌ను గురువారం పల్నాడు జిల్లా టీబీ, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ మాధవీలత తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ట్రూనాట్ ల్యాబ్‌ను పరిశీలించి ఎంతమంది రోగులు ల్యాబ్‌ను వినియోగించుకుంటున్నారనే విషయాలను పరిశీలించారు. ఐసీటీసీ సెంటర్, టీబీ యూనిట్ సిబ్బందితో మాట్లాడారు. వారికి పలు సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సత్తెనపల్లి ఏరియా అధికారి స్టాలిన్ ఉన్నారు.

24 మంది ఉపాధ్యాయులు రాక



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజుపాలెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ వలన రాజుపాలెం మండలానికి మొత్తం 24 మంది ఉపాధ్యాయులు వచ్చారని దీంతో మండలంలో ఉపాధ్యాయుల కొరత లేదని ఎంఈవో కేవీఎల్ నరసింహారావు తెలిపారు. శుక్రవారం రాజుపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలస్థాయి అధికారులు వారి శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఎంఈవో నరసింహారావు మాట్లాడుతూ ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాలలో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. తహసీల్దార్ సరోజ మాట్లాడుతూ రీసర్వే సక్రమంగా జరగటానికి రైతులు సహకరించాలన్నారు. ఇప్పుడు కొత్త రేషన్‌కార్డుల కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరి సమన్వయంతో మండలం అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఏవో వెంకట నరసయ్య మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంటనమోదు చేయించుకోవాలని కోరారు. హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ 2014నుండి ఉన్న పెండింగ్ బిల్స్ వచ్చే మార్చినాటికి జమ చేస్తారని తెలిపారు. ఐసీడీఎస్ అధికారి శ్రీలత మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. పిల్లలు లేనివారికి జిల్లా శిశుగృహ నుండి ఆన్‌లైన్ ద్వారా పిల్లలను ఇస్తారన్నారు. ఏపీవో వేంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి శ్రామికులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. తొలుత కో-ఆప్షన్ సభ్యుల మృతికి సంతాపం తెలిపారు.

టెట్ పరీక్షపై ప్రభుత్వం పునఃసమీక్షించాలి

దుర్గి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్షపై ప్రభుత్వం పునఃసమీక్షించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అనంతరామయ్య కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా ఎంపికై 25 సంవత్సరాలు పైబడి సర్వీసు పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులకు ఇప్పుడు టెట్ పరీక్షలు నిర్వహించడం ఇబ్బందికరం, కష్టతరంగా ఉంటుందన్నారు. టెట్ పరీక్షపై రివ్యూ పిటిషన్ దాఖలు చేసి రాష్ట్రంలో ఉపాధ్యాయుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించాలని జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఏడుకొండలు కోరారు. వీరివెంట ఎస్టీయూ దుర్గి మండల అధ్యక్ష, కార్యదర్శులు నబీసాహెబ్, కె.అపర్ణ, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సత్తెనపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం జక్కుల లక్ష్మీనారాయణ అధ్యక్షతన సైబర్ నేరాల పట్ల పెన్షన్ దారులకు పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఏటీఎం వద్ద డబ్బులు డ్రాచేసే సమయంలో పిన్ నెంబరు ఎవ్వరికీ చెప్పకూడదన్నారు. ఎవ్వరూ పిన్ నెంబరు చూడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాట్సప్‌కు వచ్చే లింకులను క్లిక్ చేయకూడదన్నారు. బ్యాంకులు ఎటువంటి సమాచారం కోరవన్నారు. ఎవరితో కూడా ఓటీపీలను షేర్ చేసుకోకూడదన్నారు. తప్పుడు మెసేజ్‌లను నమ్మవద్దని, హనీట్రాప్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పవన్, రిటైర్డు ఉద్యోగులు, కేబీఆర్‌జే ప్రసాదు, జెట్టి సైదులు, నళిని, ప్రభుదాసు, పోతులూరయ్య, లియోరాజు, రామకోటయ్య, మురహరిరావు, క్రీస్తుదాసు, సుందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు

భారీ వర్షాలకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

● తహసీల్దార్ కరుణకుమార్

దుర్గి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భారీవర్షాల దృష్ట్యా మండలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేస్తున్నట్లు తహసీల్దార్ కరుణకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో రెండు షిఫ్టులను ఏర్పాటుచేసి పనిచేయడానికి, సమాచారం సేకరించడానికి సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందించాలన్నారు. వర్షాల కారణంతా గోడలు పడిపోవడం, మిద్దెలు కూలిపోవడం, ఆస్థి, పంటనష్టం జరిగితే నష్టం అంచనా వేసి కంట్రలోరూమ్‌కు తెలపాలన్నారు. వర్షం కురుస్తున్నప్పుడు చెట్ల కింద, పంట పొలాల్లో, బజారులలో ఉండవద్దన్నారు. రాబోయే మూడు రోజులు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మాచవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు సూచించారు. ప్రస్తుతం తుఫాన్ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లే అవకాశాలు ఉన్నందున ఆయా గ్రామాల ప్రజలు అటువైపు వెళ్ళవద్దన్నారు. ముఖ్యంగా పిల్లేరు, పొటేళ్ళ వాగు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా గ్రామాల వాగుల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. కృష్ణా పరివాహక గ్రామాలైన రేగులగడ్డ, గోవిందాపురం ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు, రైతు కూలీలు, పసువుల కాపర్లు, వర్షాలు పడే సమయాల్లో చెట్ల వద్దకు వెళ్ళకూడదని సూచించారు. వీఆర్‌ఏలు వారివారి గ్రామాల్లో సమాచారాన్ని ఎప్పటికప్పుడు మండల కేంద్రానికి చేరవేయాలని ఆదేశించారు.

అధిక వర్షాలతో దెబ్బతింటున్న పంటలు

దాచేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తుపాన్ కారణంగా కురుస్తున్న వర్షాలు అధికం కావటంతో మిర్చిమొక్కలు ఎర్రబారటం, వేరుకుళ్ళుతో పంట దెబ్బతింటోంది. పూత, పిందె, కాయలతో ఏపుగా పెరిగిన పత్తిమొక్కలు వర్షపు నీటితో పూత, పిందె రాలిపోతోంది. దీంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికే ఎకరాకు పత్తికి రూ 50వేలు, మిర్చికి రూ.లక్షకు పైన పెట్టుబడిగా వెచ్చించారు. పంట చేతికి వచ్చే తరుణంలో కురుస్తున్న వానలు రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయి. వర్షాధార పంటలు సాగు చేసే భట్రుపాలెం, కాట్రపాడు, సారంగపల్లి అగ్రహారం, కొత్తూరు, మాదినపాడు, రామాపురం, పొందుగుల, గామాలపాడు, శ్రీనగర్ గ్రామాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో పత్తికాయ పగిలి ఉంది. ఈ తరుణంలో కాయలో నీరు చేరి పత్తి నల్లబారి నాణ్యత తగ్గిపోతుంది. మరికొన్ని చోట్ల గుడిపత్తిగా మారుతుంది. అధికవర్షాలు రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టివేస్తున్నాయి.

వివేకా కృష్ణారెడ్డికి అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డు



వివేకా కృష్ణారెడ్డి

రెంటచింతల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రెంటచింతలకు చెందిన వివేకా కృష్ణారెడ్డిని ఏపీజే అబ్దుల్ కలాం 2025 జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికచేస్తూ ఎస్‌పీఎల్‌టీవో(సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్)అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య, గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ కేఎస్ లక్ష్మణరావులు శుక్రవారం ప్రకటించారు. వివేకా టెక్నో స్కూల్ అధినేతగా,పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని పరిగణలోకి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నెల 26న గుంటూరులో అవార్డును అందుకోనున్నారు.

ఏపీఎన్జీవో గురజాల యూనిట్ ఉపాధ్యక్షుడిగా కృష్ణారెడ్డి



రెంటచింతల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్జీవో గురజాల యూనిట్ ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎన్.కృష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం గురజాలలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి కందిమళ్ల నాగరాజు చెప్పారు. డాక్టర్ ఎన్.కృష్ణారెడ్డి రెంటచింతల పీహెచ్‌సీలో గత నాలుగేళ్ల నుంచి వైద్యునిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు.

పట్టణ ప్రిన్సిపాల్స్‌కు జాతీయ అవార్డులు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ రామకృష్ణశాస్త్రి, రమణ

మాచర్ల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కిడ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ జేవీఎన్ రామకృష్ణశాస్త్రి, వాణి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ కే వీ రమణలు ఎడూకన్ జాతీయ అవార్డులు అందుకున్నారు. గురువారం విశాఖపట్నంలోని హోటల్ ఫెయిర్ ఫీల్డ్ మారియట్‌లో ఈ అవార్డులు అందుకున్నారు. మల్లా బ్యూరో ఆఫ్ చైల్డ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్, స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్, నిసా అపుస్మా, ట్రస్మా ఆధ్వర్యాన విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి భరత్, నిసా అధ్యక్షుడు కులభూషణ్ శర్మ, అపుస్మా చీఫ్‌మెంటర్ కృష్ణారెడ్డి, తులసి విష్ణు ప్రసాద్, మధు, మల్లు రామునాయుడు, మల్లు శ్రీవాణి చేతుల మీదుగా వీరు అవార్డులను అందుకున్నారు. పట్టణప్రముఖులు వీరికి అభినందనలు తెలిపారు.

వ్యక్తిగత గొడవలను పార్టీకి అంటగట్ట వద్దు

● జనసేన నాయకులు

పిడుగురాళ్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గత రాత్రి పట్టణంలోని జడ్పీ హైస్కూల్ కాంప్లెక్స్ వద్ద జరిగిన గొడవ జనసేన పార్టీకి, టీడీపీకి ఎటువంటి సంబంధం లేదని గురజాల నియోజకవర్గ జనసేన కన్వీనర్ కటకం అంకారావు, మండల కన్వీనర్ కామిశెట్టి రమేష్ తెలిపారు. కరెడ్ల సాంబశివరావు అతని భార్య రమణ వ్యక్తిగతంగా గొడవ పెట్టుకొని జనసేన పార్టీకి, నాయకులకు, కూటమినేతలకు అంటగట్టే ప్రయత్నం చేయడాన్ని ఖండిస్తున్నామని అంకారావు తెలిపారు. గత కొన్నేళ్లుగా జడ్పీ కాంప్లెక్స్‌లో షాపును సాంబశివరావు వాడుకుంటున్న విషయంపై అధికారులు విచారణ చేపట్టాలని అంకారావు డిమాండ్ చేశారు. సమావేశంలో దూదేకుల ఖాశింసైదా, అడపా వెంకట్, సలీం, బయ్యవరపు రమేష్, గుర్రం కోటేశ్వరరావు, గుంటూరు శ్రీను, నెకరికంటి నరసింహారావు, కామిశెట్టి అశోక్, షేక్ గఫూర్, తోట రామదాసు, మందా జెస్సీ తదితరులు పాల్గొన్నారు.

పరస్పర ఫిర్యాదులు

జడ్పీ కాంప్లెక్స్ షాపు విషయంలో గురువారం రాత్రి జరిగిన గొడవకు సంబంధించి పరస్పర ఫిర్యాదులు అందాయని ఎస్ఐ శివనాగరాజు తెలిపారు. నడికూడి వెంకటేశ్వరరావు, కరెడ్ల వెంకటకోటయ్య పరస్పర ఫిర్యాదులు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిడుగురాళ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రిస్టియన్ పేటకు చెందిన గంధం సంతోషబాబు(40) గురువారం పిల్లుట్ల రోడ్డు వైపు వెళ్తుండగా విజయవాడ వెళ్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలై ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడని ఎస్ఐ శివనాగరాజు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సస్యరక్షణే..పంటకు శ్రీరామరక్ష

● పొలాల్లో నిలిచిన వర్షపు నీరు ● రైతులకు జాగ్రత్తలు సూచిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు


జేడీ అయితా నాగేశ్వరరావు


కొల్లూరులో వర్షపునీటిలో నానుతున్న వరి పంట(ఫైల్‌ఫొటో)

గుంటూరు సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు రైతులు పంటల రక్షణకు కొన్ని జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వర రావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో అల్పపీడనం వల్ల కురుస్తున్న అధిక వర్షాలకు వివిధ పంటల్లో సూచించిన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. పొలం నుంచి మురుగు నీటిని తొలగించాలన్నారు. రాబోవు రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట పొలాల్లో మందులను పిచికారి చేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలన్నారు. వరి పిలకలు కట్టే దశలో నీరు బయటకు తీసిన వెంటనే ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేయడం వల్ల పంట త్వరగా పుంజుకుంటుందని చెప్పారు. నష్టం చాలా వరకు తగ్గుతుందన్నారు.

● దుబ్బు చేసే దశలో ఉన్న పంటలో బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు 0.2 గ్రాములు ప్లాంటమైసిన్ మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని చెప్పారు. నత్రజని ఎరువును మోతాదుకు మించి ఉపయోగించకూడదని, రెండవ దఫా ఎరువును వేసుకోవడం వాయిదా వేసుకోవాలని తెలిపారు.

● కాండం కుళ్లు రావడానికి కూడా అవకాశం ఎక్కువగా ఉందన్నారు. నివారణకు 2.5గ్రాముల కార్బెండజిమ్, మ్యాంకోజెబ్ శిలీంధ్ర నాశక మందును లేదా మీ.లీ వాలిడామైసిన్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.

● అగ్గి తెగులును గమనించినట్లయితే 0.6 గ్రాముల ట్రై సైక్లోజోల్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు.

● పత్తి పంటలో ప్రస్తుతం వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ రసాయనిక ఎరువులను పైపాటుగా పంటకు మొక్కల మొదళ్లలో 7-10 సెం.మీ పాదులు తీసి రసాయనిక ఎరువులను వేసి మట్టితో కప్పాలని సూచించారు.

● ముంపునకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 లేదా 13-0-45 లేదా 10 గ్రాముల యూరియా లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు.

● పిండి నల్లి రావడానికి అవకాశం ఎక్కువగా ఉందని, ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా రెండు మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. నేల ద్వారా వ్యాప్తి చెందే ఎండు తెగులు నివారణకు 3 గ్రా. కాపర్ - ఆక్సి-క్లోరైడ్ లేదా ఆల్టర్నేరియా ఆకు మచ్చ తెగులుని నివారణకు 2.5 గ్రాముల కార్బెండజిమ్, మ్యాంకోజెబ్ శిలీంధ్రనాశక మందును లీటరు నీటిలో కలిపి నేల బాగా తడిచేటట్టు వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు.

● మినుము పొలములో మురుగు నీరు ఎప్పటికప్పుడు తీసివేయాలని, వర్షం ఆగిన తరువాత లేత పైరులో సాయంత్రం వేళలో ఒక ఎకరానికి 15 కేజీల యురియా, 10 కేజి ల పొటాష్ వేయాలన్నారు. జింక్, ఇనుము లోపాలు (ముఖ్యంగా నల్ల నేలల్లో) అధిక వర్షాల కారణంగా సంభవించే అవకాశం ఉందన్నారు. వర్షాలు ఆగిపోయిన తరువాత సూక్ష్మ పోషకాలను అందించాలన్నారు. పెసర పంట పొలంలో ఉన్న మురుగు నీరు ఎప్పటికప్పుడు తీసివేయాలన్నారు. వర్షం ఆగిన తర్వాత లేత పైరులో సాయంత్రం వేళలో ఎకరానికి 15 కేజీల యురియా, 10 కేజీల పొటాష్ వేయాలని పేర్కొన్నారు. రాత్రి ఉష్ణోగ్రత తగ్గి మంచు పడడం వల్ల పెసరలో బూడిద తెగులు ఆశించవచ్చని, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీని నివారణకు హెక్సాకొనజోల్ 2.మి.లీలు లేదా ప్రోపికొనజోల్ మి.లీ లేదా కార్బడిజం గ్రాము.. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని చెప్పారు.

కమ్యూనిస్ట్ దిగ్గజం స్టాలిన్‌బాబు ఇక లేరు!

● ఆల్ ఇండియా ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ సెక్రటరీగా సేవలు
● సీపీఐ నేత చంద్ర రాజేశ్వరరావుతో సన్నిహిత సంబంధాలు
● నారాయణ, ముప్పాళ్ల ఆయన శిష్య బృందమే
● నేడు గుంటూరులో అంత్యక్రియలు


స్టాలిన్‌బాబుకు నివాళులర్పిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, విషణ్ణ వదనంలో కుటుంబ సభ్యులు


బొప్పూడి స్టాలిన్‌బాబు (ఫైల్ ఫొటో)

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, ఆల్ ఇండియా ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ పూర్వ కార్యదర్శి బొప్పూడి స్టాలిన్ బాబు(83) శుక్రవారం తుదిశ్వాస విడిచారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శ్యామలా నగర్‌లోని నివాసంలో కన్నుమూశారు. ఆయన తండ్రి బొప్పూడి కోటయ్య స్వాతంత్ర్య సమరయోధుడు. గుంటూరు ఏసీ కళాశాలలో బీఏ చదివిన స్టాలిన్ బాబు విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు సిద్ధాంతలపై మక్కువ చూపారు. సీపీఐ అనుబంధ విభాగం ఏఐఎస్ఎఫ్‌లో స్టాలిన్‌బాబు చురుకైన పాత్ర పోషించారు. సీపీఐ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావుతో ఆయనకు ఎంతో గొప్ప అనుబంధం ఉంది. కమ్యూనిస్టు నేతలు కామ్రేడ్ ఎస్ఏ డాంగే, మినాజ్ కర్, పెరవలి కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డి, నారాయణకు ఆయన అత్యంత సన్నిహితులుగా వ్యవహరించారు. 1970లో గుంటూరులో జరిగిన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జాతీయ మహాసభలను నిర్వహించడంలో చురుకైన పాత్ర పోషించారు. అలాగే విజయవాడలో జరిగిన సీపీఐ జాతీయ 10వ మహాసభలకి జనసేవాదళ్ రాష్ట్ర ఉప కమాండర్‌గా వ్యవహరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో జైలు పాలవడమే కాకుండా.. పోలీసు లాఠీ దెబ్బలకు ప్రాణాలకు తెగించి మరీ ఆయన పోరాడారు. యువజన విద్యార్థి ఉద్యమాలకు వేగు చుక్కగా ఉండి వేలాది మంది విద్యావంతులైన యువకులను ఆకర్షించి సీపీఐ కార్యకర్తలుగా తీర్చిదిద్దడంలో స్టాలిన్‌బాబు కీలక పాత్ర పోషించారు. నాటి సీపీఐ అగ్ర నాయకులు కనపర్తి నాగయ్య, వల్లూరు గంగాధర్, మల్లయ్య లింగం, వేములపల్లి శ్రీకృష్ణ తదితర నేతలతో ఆయనకు బలమైన అనుబంధం ఉంది. ప్రస్తుత సీపీఐ జాతీయ నాయకులు కె.నారాయణ, రాష్ట్ర నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు ఈయన శిష్య బృందమే. 1968లో స్టాలిన్‌బాబుకు కొడాలి మరుద్వతితో వివాహం జరిగింది. ఆమె శ్రీవేంకటేశ్వర బాల కుటీర్ అనుబంధ సంస్థ చేతన చారిటబుల్ ట్రస్ట్ కార్య నిర్వహకురాలిగా వ్యవహరిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు మధుభారతి, కవిత. స్టాలిన్ బాబు మరణానంతరం నేత్రాలను శంకర నేత్రాలయకు దానం చేశారు. ఆయన మృతికి సీపీఐ సీనియర్ నేత నారాయణ, జాతీయ, రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, జి.ఈశ్వరయ్య సంతాపం తెలిపారు. గుంటూరులోని నివాసంలో ఆయన మృతదేహానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, అకిటి అరుణ్‌కుమార్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు నివాళులర్పించారు.

నేడు మహాప్రస్థానంలో అంత్యక్రియలు

కమ్యూనిస్టు నేత స్టాలిన్‌బాబు అంత్యక్రియలు శనివారం స్తంభాల గరువులోని మహాప్రస్థానంలో నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర నాయకులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు తెలిపారు. శ్యామలానగర్ 7వ లైనులోని స్వగృహం నుంచి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు మధ్య అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

అంబేడ్కర్ చైర్‌ను సందర్శించిన ఎక్స్‌పర్ట్ కమిటీ

ఏఎన్‌యూ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ న్యూఢిల్లీ నుంచి వచ్చిన ఎక్స్‌పర్ట్ కమిటీ శుక్రవారం సందర్శించింది. డైక్ సెంటర్‌కు చెందిన డాక్టర్ బీకే పాండే అంబేడ్కర్ చైర్ విభాగాన్ని పరిశీలించారు. ప్రొఫెసర్ ఆచార్య వై.అశోక్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన ఎవల్యూషన్ అండ్ ఇంటరాక్షన్ కార్యక్రమంలో గడిచిన ఐదేళ్లలో అంబేడ్కర్ చైర్ చేపట్టిన కార్యక్రమాలు, పబ్లికేషన్స్, పీహెచ్‌డీలు, సామాజిక కార్యక్రమాలు, సాధించిన అవార్డులను ప్రొఫెసర్ అశోక్‌కుమార్ వివరించారు. అలాగే అంబేడ్కర్ చైర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులతో పాటు నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. తద్వారా విభాగం పరిపూర్ణంగా కార్యక్రమాలు చేసే వీలు ఉంటుందని పాండే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పరిశోధకులతో పాండే మాట్లాడారు. పరిశోధనల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిశోధనల ద్వారా సమా జానికి ఇచ్చే సందేశాలను ఆయన వారికి తెలియజేశారు. అంబేడ్కర్ చైర్ పనితీరును ఆయన అభినందించారు. అనంతరం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం లను మర్యాద పూర్వకంగా కలిశారు. అంబేడ్కర్ చైర్ అభివృద్ధికి ఫౌండేషన్‌మరిన్ని నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్, సిబ్బంది డాక్టర్ వి.శ్రీనివాస్, అబ్రహం, వెస్లేరు, పరిశోధకులు పాల్గొన్నారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటి మట్టం శుక్రవారం నాటికి 587.10 అడుగులు ఉంది. ఇది 305.56 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4,050, ఎడమ కాలువ ద్వారా 6,097, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,901, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎ ల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 46,748 క్యూసెక్కుల నీటిని దిగువ కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 46,748 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

1.0701 ఎం.యూ విద్యుత్ ఉత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ ప్రాజెక్ట్‌లో 2 యూనిట్ల ద్వారా గురువారం అర్ధ రాత్రి 12 గంటల వరకు 1.0701 ఎం.యూ విద్యుత్ ఉత్పత్తి జరిగినట్లు ఎస్ఈ వెంకటరమణ, ఈఈలు చెప్పారు. ప్రాజెక్ట్‌కు చెందిన 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 2 గేట్లను మీటరు మేర ఎత్తి 8,468, టెయిల్ రేస్ చానల్ ద్వారా 8,704, మొత్తంగా 21,406 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ఎగువున సాగర్, ఎత్తిపోతల , హాలియా వాగుల నుంచి 33,292 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరు ఉండగా, ఇది 7.080 టీఎంసీలకు సమానమని చెప్పారు.


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

డెల్టా కాలువలకు 511 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 52,889 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 11.5 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 52,378 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 511 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, పశ్చిమ డెల్టాకు, గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

ప్రాథమిక ఆర్థిక సూత్రాలే సుస్థిర స్వేచ్ఛకు పునాది

● ఆర్థిక శాస్త్రవేత్త పట్నాయక్


ఆచార్య పట్నాయక్

గుంటూరు విద్య అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టే ఐదు ప్రాథమిక సూత్రాలు. అభివృద్ధి, సమానత్వం, స్థిరత్వం, సామాజిక భద్రత, ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఆచార్య ప్రభాస్ పట్నాయక్ అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ఫ్రీడమ్ ఇన్ ది ఏజ్ గ్లోబలైజేషన్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. గ్లోబలైజేషన్ యుగంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు మందగమనం దిశగా వెళ్తున్నాయని పేర్కొన్నారు. సంక్షోభం అంటే కేవలం ఆర్థిక క్షీణత కాదని, అది ప్రస్తుత వ్యవస్థను ప్రశ్నించే, మార్పును కోరుకునే దశ అని వివరించారు. గ్లోబలైజేషన్ ప్రభావంలో వ్యక్తిగత స్వేచ్ఛ క్షీణిస్తుందన్నారు. మరో ముఖ్య అతిథి విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ జ్ఞానం పంచుకున్నప్పుడే పెరుగుతుందని, ఒకరితో ఒకరు నేర్చుకోవడం, పరస్పర మేధో మార్పిడి సమాజ అభివృద్ధికి పునాది అవుతుందన్నారు. డీన్లు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ అక్రమాలపై చర్యలు తీసుకోండి

● ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్

పెదకాకాని, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ట్రావెల్ సంస్థల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నన్నపనేని శివాజీ, ముజఫర్ అహ్మద్ శుక్రవారం డిమాండ్ చేశారు. ఒడిశాలో కేవలం 43 సీటింగ్ కాంట్రాక్ట్ క్యారియర్ పర్మిషన్ తీసుకొని స్లీపర్ కోచ్‌గా మార్చి అక్రమాలకు పాల్పడిన కావేరి ట్రావెల్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రమాదంలో చనిపోయిన 19 మంది ప్రయాణికుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే ఆర్టీసీ సంస్థలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోటార్ వాహనాల చట్టంలో సవరణలు చేసి ముంచేశారని విమర్శించారు. రాజకీయ నాయకుల బినామీ పేర్లతో నడుస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రమాదానికి గురైన కావేరి ట్రావెల్స్ బస్సు డిజైన్‌లో తప్పులు ఉన్నాయని.. బస్సు పెండింగ్ చలానాలు రూ.23,120 పెండింగ్ ఉన్నట్లు అధికారులు తెలియజేయడం ఆశ్చర్యాన్ని గురిచేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థ ఆర్టీసీని బలోపేతం చేసి ప్రజలకి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు.

ఏఐ రాకతో నాలుగో పారిశ్రామిక విప్లవం

● మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ రాజీవ్ కుమార్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాజీవ్‌కుమార్, ప్రొఫెసర్ మధుమూర్తి, ఎమ్మెల్సీ ఆలపాటి

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ల రాకతో మూడో పారిశ్రామిక విప్లవం మొదలవగా, కృత్రిమ మేధ(ఏఐ) రాకతో నాలుగో పారిశ్రామిక విప్లవం ప్రారంభమైందని మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా విశదలలోని ఎన్.ఆర్.ఐ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన సాంకేతిక సదస్సుకు రాజీవ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాంకేతికతలో నూతన ఒరవడులు, పరిశ్రమలకు విద్యార్థుల సన్నద్ధత అంశంపై ఆయన కీలకోపన్యాసం చేశారు. ముప్పై ఏళ్లకు పైగా మైక్రోసాఫ్ట్‌లో పని చేస్తున్నానని, బిల్ గేట్స్, స్టీవ్ బామర్, సత్య నాదెళ్ల వంటి ప్రముఖ సీఈవోలతో కలిసి పని చేశానని చెప్పారు. ఆర్థికాభివృద్ధి, జీడీపి వృద్ధిలో కృత్రిమ మేధ కీలకంగా ఉంటోందన్నారు. కృత్రిమ మేధ ఎవరిని రీప్లేస్ చేయలేదు కానీ ఎవరికైనా సహాయకారిగా ఉంటుందన్నారు. అపజయం పాలైనప్పుడు చేతులెత్తేయడం కాకుండా మళ్లీ ప్రయత్నించి గెలవడం ముఖ్యమని విద్యార్థులను చైతన్య పరిచారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తి, ఎన్ఆర్ఐ విద్యా సంస్థల చైర్మన్ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలి

● సీసీఐ మేనేజర్ రాజేంద్ర షా

గుంటూరు సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జనరల్ మేనేజర్ రాజేంద్ర షా కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26లో పత్తిపంటకు సీసీఐ మద్దతు ధర పొందాలంటే.. కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌లో నమోదు కావాలన్నారు. ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకున్న రైతులు మొబైల్ ఫోన్ నంబరుకు వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ కావాలన్నారు. మద్దతు ధరకు విక్రయానికి యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని చించారు.

ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల..

వర్క్‌షాపు ల్యాబ్‌లో చోరీ



ఏఎన్‌యూ ముఖద్వారం

ఏఎన్‌యూ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల వర్క్‌షాపులోని ఈఈఈ విభాగం ల్యాబ్‌లో చోరీ జరిగింది. చోరీ చేయాలనే ముందుస్తు ప్రణాళికతో కొందరు వర్క్‌షాపు తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించారు. అక్కడ సుమారు 30 పైగా బల్లల కింద ఉన్న కాపర్ వైర్లు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. అలాగే మెకానికల్ వర్క్ షాపులోని రెంచీలు, బోల్ట్‌లు కూడా ఎత్తుకెళ్లినట్లు సమాచారం. విశ్వవిద్యాలయం తాత్కాలిక రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం ల్యాబ్‌ను పరిశీలించారు. పెదకాకాని పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు వర్సిటీకి చేరుకుని ల్యాబ్‌ను పరిశీలించారు. అక్కడ పనిచేసే టెక్నీషియన్లు, అటెండర్లు, స్వీపర్లను విచారించారు. గతంలో ఇంజనీరింగ్ కళాశాల భవనాల కిటికీలకు అమర్చిన ఫ్రేమ్‌లను దొంగిలించారు. చోరీలు భద్రత వ్యవస్థ పటిష్ఠతను తేటతెల్లం చేస్తున్నాయి.

ఇంజనీరింగ్ విద్యార్థుల మధ్య ఘర్షణ

వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలోని కొందరు విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరి మీద ఒకరు దాడి చేసుకున్నారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న వర్సిటీ అధికారులు విచారణకు ఆదేశించారు. ఓఎస్డీ ఆచార్య రవికుమార్, ఇంజనీరింగ్ కళాశాల తాత్కాలిక ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ లావణ్యతో కమిటీని నియమించారు. నివేదిక ఆధారంగా ఘర్షణ పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోనున్నారు.

పంచారామాలకు..

ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు

● కార్తీక మాసం టూర్ ప్యాకేజీలు
● ప్రతి శని, ఆదివారం బయల్దేరేలా ప్రణాళికలు

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభంతో శివ భక్తుల కోసం ఆర్టీసీ పంచారామాలకు ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. పంచారామాలైన సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతిలో ఒక రోజులోనే దర్శించుకునేలా టూర్ ప్యాకేజీ సిద్ధం చేసినట్లు గుంటూరు-1 డిపో మేనేజర్లు రామకృష్ణ, 2 డిపో మేనేజర్ సీహెచ్ సునీత తెలిపారు. గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండు నుంచి ప్రతి శని, ఆదివారం రాత్రి 9.15 గంటలకు బయల్దేరేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అంతేగాక 35 మంది యాత్రికులు ఉన్నట్లయితే వారు ఉన్న ప్రాంతానికే బస్సు వచ్చి ఎక్కించుకునేలా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రాత్రి గుంటూరు బస్టాండ్ నుంచి బయల్దేరి ఉదయం సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం నుంచి చివరగా అమరావతి పుణ్యక్షేత్రాలను దర్శించుకొని రాత్రి 9 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు బస్సు చేరుతుందని తెలిపారు.

త్రిశైవ క్షేత్రాలకు స్పెషల్ సర్వీసులు...

అలానే త్రిశైవ క్షేత్రాలైనా యాగంటి, మహానంది, శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు కూడా సర్వీసును ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులు గుంటూరు -2 డిపో 73828 97115, గుంటూరు-1 కు 73828 89830 కు సంప్రదించవచ్చని కోరారు.

పంచారామాల చార్జీల వివరాలు

ఎక్స్‌ప్రెస్ - రూ. 870
అల్ట్రా డీలక్స్ - రూ.1,130
సూపర్ లగ్జరీ - రూ.1,180

త్రి శైవ దర్శన చార్జీలు

ఎక్స్‌ప్రెస్ - రూ.1080
అల్ట్రా డీలక్స్ - రూ.1,380
సూపర్ లగ్జరీ - రూ.1,440

ఎండ.. వాన

(5వ పేజీ తరువాయి)

జలమయమయ్యాయి. గురువారం వరకు పడిన వర్షంతో ఎక్కడికక్కడ పొలాలు నీటితో నిండిపోయాయి. పల్నాడు జిల్లా పరిధిలో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. పల్నాడులో అధిక వర్షాలు పత్తి, మిర్చి రైతులను దారుణంగా దెబ్బతీశాయి. డెల్టాలో వరి రైతుల వెన్ను విరిచాయి. గురువారం పడిపోయిన విస్తీర్ణం కంటే రెట్టింపు చేలు నేలవాలాయి. ముసురు పట్టి ఉండటంతో కంకులు కూడా తాలుగా మారిపోతాయని రైతులు తెలిపారు. నేలవాలిన చేలల్లో ఎకరాకు రెండు నుంచి ఐదు బస్తాల వరకు దిగుబడిలో నష్టం ఏర్పడుతుందని రైతులు చెబుతున్నారు. పడిపోయిన వరిని పైకిలేపి కట్టించేందుకు ప్రయాస పడుతున్నారు. అల్పపీడనం బలహీనపడినా, వాతావరణంలో మార్పులు లేకపోవడంతో నిజాంపట్నం హార్బర్‌లో శుక్రవారం కూడా మూడో నెంబరు ప్రమాద హెచ్చరికను కొనసాగించారు. వాతావరణ శాఖ నుంచి సమాచారం వచ్చేవరకు అదే కొనసాగుతుందని పోర్టు అధికారులు చెప్పారు. అయితే సముద్రంలో వేటపై ఆంక్షలు ఇంకా సడలించలేదని, ఎవరూ సముద్రంలోకి వెళ్లటానికి వీలులేదని అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే రైతులు కుదేలవగా ఈ నెల 27 నుంచి మళ్లీ భారీ వర్షాల హెచ్చరికలు వాతావరణ శాఖ చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధికారులు అప్రమత్తం..

వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో పల్నాడు జిల్లా పరిధిలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే మండల కేంద్రాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేయగా వాటిని కొనసాగించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కాగా శుక్రవారం పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. పలు గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లే అవకాశాలు ఉన్నందున ప్రజలు అటు వైపు వెళ్లరాదని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా పిల్లేరు, పొటేళ్ల వాగు పరివాహక ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. కృష్ణానదీ పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల వీఆర్‌ఏలు వారి వారి గ్రామాల్లో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అధికారులకు అందించాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. కాగా వీడని వర్షాలతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి మొక్కలు ఎర్రబారాయని, వేరు కుళ్ళు పడ్డాయని, ఏపుగా పెరిగిన పత్తి వర్షపు నీటితో పూత, పిందె రాలి పోతుందని సాగుదారులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ధర లేక ఇబ్బందులు పడుతుండగా అధిక వర్షాలు మరింత ఇబ్బందుల్లోకి నెట్టి వేస్తున్నాయని తెలిపారు.


రేపల్లె జలమయమైన మున్సిపల్ ఆఫీస్ రోడ్డు

6,800 ఎకరాల్లో పంట నష్టం

మూడు రోజుల నుంచి బాపట్ల జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు శుక్రవారం సాయంత్రానికి శాంతించాయి. పంట నష్టాలపై ప్రాథమిక గణన చేపట్టిన వ్యవసాయశాఖ జిల్లాలో 6,800 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తేల్చింది. భారీ వర్షాలతో 74 గ్రామాల పరిధిలో 5,010 మంది రైతులకు నష్టం వాటిల్లిందని అంచనా వేవారు. తుది నివేదికలో ఈసంఖ్య దాదాపు 11,000 ఎకరాల వరకు ఉండొచ్చని సమాచారం. జె. పంగులూరు మండలంలో 2,500 ఎకరాల్లో మినుము, మార్టూరు మండలంలో 1,200 ఎకరాల్లో మినుము, పత్తికి 750 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ తేల్చింది. ఇంకొల్లు మండల పరిధిలో పత్తి, మినుము కలిపి దాదాపు 750 ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. రేపల్లె నియోజకవర్గంలో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన వర్షంపడింది. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు, పలు కాలనీలు జలమయ్యాయి. బస్సులు కూడా కదలకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్టాండ్‌కే పరిమితమయ్యారు. చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం, రేపల్లె మండలాల్లో అధికవర్షం పడింది. చెట్లు, విద్యుత్‌స్తంబాలు నేలవాలాయి.


పొన్నూరు జీబీసీ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

వీడని వర్షంతో ఆందోళన

గుంటూరు, తెనాలి, పొన్నూరు, పెదనందిపాడు తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. రాజధాని ప్రాంతంలోని గ్రామాలు, మంగళగిరి, తాడేపల్లి పట్టణాల్లో కూడా రోడ్లు వర్షపు నీటితో నిండాయి. ప్రధాన రోడ్లతో పాటు పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచి రోడ్లపై ప్రవహించాయి. ఇప్పటికే పత్తి, మినుము, సోయాబీన్, మొక్కజొన్న కోతదశలో ఉండగా వీడని వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప నాట్లు వేసిన రైతులు మొక్కలు నీటిలో నానుతుండడంతో ఉరకెత్తి చనిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొన్నూరులో మధ్యాహ్నం వరకు ఏకధాటిగా కురిసిన వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

బీజేపీ మీడియా రాష్ట్ర ప్రతినిధిగా రామకృష్ణ


తాడువాయి రామకృష్ణ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధిగా తాడువాయి రామకృష్ణ నియమితులైయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. కీలక బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావుకు రామకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కర్నూలు బస్సు దుర్ఘటన విషాదకరం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాద ఘటనలో 20మందికి పైగా సజీవదహనం కావడం అత్యంత విషాదకరమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తమ వారిని కోల్పోయిన కుటుంబాల దయనీయ పరిస్థితి చూస్తే మనసు తరుక్కుపోతోందని చెప్పారు. ఈ దుర్ఘటనపై రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర విచారణ జరిపించి, ప్రమాదానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు ఎస్సీ, ఎస్టీలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నరసరావుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల కోసం శనివారం నరసరావుపేట కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ఎస్సీలు, ఎస్టీలు ప్రత్యేక పరిష్కార వేదికను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

జూదరుల అరెస్టు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకురాలు, పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు. నరసరావుపేట మండలం ఇసప్పాలెంకు చెందిన ఎస్కే పర్వీన్ తన ఇంటిలో గత కొంతకాలంగా పేకాట శిబిరాన్ని నిర్వహిస్తోంది. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ కిషోర్ తన సిబ్బందితో శుక్రవారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్న ఎస్కే పర్వీన్‌తో పాటు మరో 9మంది జూదరులన అదుపులోకి తీసుకున్నారు. పేకాట శిబిరం వద్ద రూ.16,350 స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

మహంకాళి అమ్మవారి ఆలయ పునః నిర్మాణానికి విరాళం

ఇసప్పాలెం (నరసరావుపేట రూరల్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసప్పాలెం గ్రామంలోని మహంకాళి అమ్మవారి ఆలయం పునఃనిర్మాణానికి భక్తులు విరాళం అందజేశారు. నరసరావుపేట పట్టణానికి చెందిన కాపులపల్లి వెంకటేశ్వరరెడ్డి, వరలక్ష్మి దంపతులు ఆలయ పునః నిర్మాణం కోసం రూ.1,00,232 విరాళంగా శుక్రవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి నలబోతు మాధవీదేవికి అందజేశారు. శుక్రవారం మహంకాళి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో దాతలు కాపులపల్లి వెంకటేశ్వరరెడ్డి, వరలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, అధికారులు దాతలకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

కోటప్పకొండ ఘాట్ రోడ్డులో కార్లు ఢీ

కోటప్పకొండ (నరసరావుపేట రూరల్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ ఘాట్ రోడ్డులో శుక్రవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన జరిగింది. ఏలూరు పట్టణానికి చెందిన కుటుంబం, తణుకు ప్రక్కన ఉన్న అత్తిలి గ్రామానికి చెందిన కుటుంబం కార్తీక మాసం సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చారు. ప్రమాదంలో వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

వినుకొండ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు యాచకుడని స్థానికులు తెలిపారు.

28న చిలకలూరిపేటలో వైసీపీ భారీ ర్యాలీ : విడదల

చిలకలూరిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమంలో భాగంగా ఈ నెల 28న చిలకలూరిపేట నియోజకవర్గంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు మాజీమంత్రి విడదల రజిని శుక్రవారం తెలిపారు. ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఇక్కడ తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగించాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయం పేదలు, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే విధంగా ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి మంచి స్పందన వస్తున్నదని, దీనిని మరింత జాగ్రత్తగా, సమర్థవంతంగా ముందుకు తీసుకువెళ్లాలని ఆమె సూచించారు. ర్యాలీని ప్రజా భాగస్వామ్యంతో వైసీపీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ర్యాలీ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, ప్రచార కార్యక్రమాలపై పార్టీ నాయకులతో చర్చించారు.

ఏకగ్రీవంగా టీడీపీ ఎస్టీ సెల్ ఎన్నికలు

చిలకలూరిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ టీడీపీ ఎస్టీ సెల్ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా పాలపర్తి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నూనావత్ రమేష్ నాయక్, ఉపాధ్యక్షుడిగా పాలపర్తి విజయ్, ఏకసిరి కొండమ్మలు ఎన్నికయ్యారు. నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పటాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, మురకొండ మల్లిబాబు ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి.

రైతుల సమక్షంలోనే భూముల రీ సర్వే చేయాలి

● జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, పక్కన జిల్లా సర్వే అధికారి భాను కీర్తి తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే పనులు రైతుల సమక్షంలో చేయాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే ఆదేశించారు. శుక్రవారం నరసరావుపేట పల్నాడు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రీసర్వే మూడో విడత ప్రక్రియపై మండల సర్వేయర్లతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే మాట్లాడుతూ పెండింగ్ భూ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని సర్వే అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో పెండింగ్‌లో ఉన్న భూసంబంధిత రీ సర్వేలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. భూ సమస్యలను పరిష్కరించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులపై శ్రద్ధ వహించి పరిష్కరించాలన్నారు.

అసైన్డ్ భూములు, ఇనాం భూములు, మ్యుటేషన్ కన్వర్షన్, సబ్‌డివిజన్స్, ఎఫ్‌లైన్ పిటిషన్ వ్యవసాయ భూములు మార్పులు వంటి విషయాలపై సుదీర్ఘంగా చర్చించి పలు సలహాలు అందజేశారు. రీ సర్వే మూడో విడత ప్రక్రియలో భాగంగా 44 రోజులలో, గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేయాలన్నారు. అక్టోబరు 3న ప్రారంభమైన మూడో విడత రీసర్వే ప్రక్రియలో ఇప్పటివరక 25 గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేశామని జిల్లా సర్వే అధికారి భానుకీర్తి చెప్పారు.

నకిలీ మద్యం గుర్తింపునకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు


ఏపీ ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ కీలక పాత్ర వహిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం ఏపీ ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్‌ను నరసరావుపేట నియోజవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖలో నకిలీ మద్యం గుర్తించడానికి ఈ యాప్‌ను ఎక్సైజ్ యాప్‌ను అధికారులు అభివృద్ధి చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం నాణ్యతలేని నకిలీ మద్యాన్ని విక్రయించి కోట్లు సంపాదించారన్నారు. ఎంతోమంది ప్రజల ప్రాణాలను బలి తీసుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తూ అన్ని రంగాలలో జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు. నకిలీ మద్యాన్ని నిరోధించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్‌ని తీసుకొచ్చిందన్నారు. నకిలీ మద్యం వల్ల జరుగుతున్న హానిని దృష్టిలో ఉంచుకొని ఈ యాప్ ప్రారంభించారన్నారు. ప్రజలు ఈ యాప్ ద్వారా మద్యం బాటిల్స్‌పై క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, అసలైనదా, నకిలీదా అని తెలుసుకోవచ్చునన్నారు. ఈ యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫాంలలో అందుబాటులో ఉందన్నారు. దీని ద్వారా మద్యం మూలం, మాన్యుఫాక్చరింగ్ డేట్, ఎక్స్‌పైరీ వివరాలు తెలుస్తాయని చెప్పారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ మాట్లాడుతూ ఈ యాప్ ఆధారంగా నకిలీ మద్యం గుర్తించి, సమస్యలు ఎదురైతే యాప్‌లోనే ఫిర్యాదు నమోదు చేయవచ్చు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సోమయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలి

ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చిన 2010 ముందే నియామకం అయి పనిచేస్తున్న ఇన్ సర్వీస్ టీచర్లు అందరూ టెట్ ఉత్తీర్ణత పొందాలన్న సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం జాప్యం లేకుండా రివ్యూ పిటిషన్ వేయాలని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం నరసరావుపేటలోని ఎస్‌టీయూ భవనంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ 2010 ముందు నియమితులైన ఇన్ సర్వీస్ టీచర్లు అందరూ వృత్తిపరమైన విద్యార్హతతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణులైన వారేనని చెప్పారు. వారిని టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి, ఎన్‌సీటీఈ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ఏఐఎస్‌టీఎఫ్‌తో పాటు కొన్ని జాతీయ ఉపాధ్యాయ సంఘాలు రివ్యూ పిటిషన్ వేయడంతో పాటు తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాలు రివ్యూ పిటిషన్ వేయడానికి సానుకూలంగా స్పందించనట్లు తెలిపారు. రాష్ట్రంలో లక్ష ఇరవైవేల మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్‌పై ఆందోళన చెందుతున్నారని అన్నారు. వెంటనే సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయడంతో పాటు విద్యాహక్కు చట్టం సవరణకు కృషి చేయాలని కోరారు.

కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్వీ రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి యూ చంద్రజిత్ యాదవ్, ఆర్థిక కార్యదర్శి ఏ ఏమండి, గౌరవాధ్యక్షుడు ఎస్కే కరిముల్లా, అసోసియేట్ అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని, కే ఏసయ్య, పీ భీష్మారావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ఎన్‌ఆర్‌టీలో సైబర్ నేరాలపై అవగాహన

నరసరావుపేట రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూ నరసరావుపేట కళాశాలలో శుక్రవారం ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నేటి డిజిటల్ యుగంలో సైబర్ భద్రత అత్యంత కీలకమని ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అవగాహన సదస్సుకు సైబర్ క్రైమ్ చీఫ్ కౌన్సెలర్ కె.ప్రదీప్ ముఖ్య అతిథిగా హాజరై, సైబర్ నేరాల నియంత్రణ, ఆన్‌లైన్ భద్రత, విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ఎస్. కిశోర్ బాబు, ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు, వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జీపీ రాజు పాల్గొన్నారు.

వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఐబీఎం సంస్థ శిక్షణ

నరసరావుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట వాగ్దేవి డిగ్రీ కళాశాలలో యువ ఆన్‌స్టాపబుల్ కింద ఐబీఎం సంస్థ శిక్షణ కార్యక్రమం నిర్వహించిందని ప్రిన్సిపాల్ కే రాజేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. ట్రైనర్లు పూజిత, చైతన్యలు ఐబీఎం స్కిల్స్‌లో విద్యార్థులు ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి, ఆర్టీఫీసీఎల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ మార్కెటింగ్ కోర్సులలో ఉచితంగా సర్టిఫికేషన్ ఎలా పొందాలి అనే విషయాలు వివరించారు. ఐబీఎం నిర్వహించిన ఈ హాండ్స్ ఆన్ సెషన్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు ఐబీఎం లాంటి కంపెనీ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్ కల్పించడం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, చైర్మన్ కాట్ల రామకోటేశ్వరరావు, డైరెక్టర్లు ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి కృష్ణకిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసరావుపేట ఓబీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా రావూరి

నరసరావుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం నరసరావుపేట పట్టణ అధ్యక్షుడిగా రావూరి వెంకటకోటేశ్వరరావు శుక్రవారం నియమితులయ్యారు. అఖిల భారత సంక్షేమ ఓబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, పట్టణంలో జరిగిన కార్యక్రమంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొర్రెపాటి సంజీవరావు, బత్తుల వెంకటేష్, అల్లంశెట్టి మోహనరావు, నార్ల మారుతి, టీ నరసింహరావు, అరవపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఐవోటీ టింకరింగ్ ఇన్నోవేషన్ పద్ధతులను వివరిస్తున్న సిలికాన్ టెక్ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ ప్రతినిధి ఫరూక్ గైబ్ తదితరులు

ఈశ్వర్‌లో రీసెర్చ్ వర్క్‌షాప్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో గుంటూరు సిలికాన్ టెక్ సొల్యూషన్స్ సహకారంతో టింకరింగ్ ల్యాబ్ అండ్ ఇన్నోవేషన్‌పై రీసెర్చ్ వర్క్‌షాప్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. సిలికాన్ టెక్ సొల్యూషన్ సాఫ్ట్‌వేర్ ప్రతినిధి షేక్ ఫరూక్ గైబ్ వివిధ రకాల ఐవోటీ టింకరింగ్ ఇన్నోవేషన్ పద్ధతులను ప్రయోగశాలలో ప్రత్యక్ష పద్ధతిలో చేసి చూపించారు. అవసరాన్ని బట్టి సెన్సర్లను ఉపయోగించడం ద్వారా ప్రమాదాల నుంచి రక్షణ పొందగలమన్నారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, ఆటో మొబైల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆర్.రాంబాబు, మెకానిక్ షేక్ చాంద్‌మాబుసుభాని, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవినాయక్

క్విజ్‌లో రెడ్డిపాలెం మోడల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

రొంపిచర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెం మోడల్ పాఠశాల విద్యార్థులు క్విజ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం రవినాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దిశ, ఎయిడ్స్, హెచ్ఐవీ యూత్ ఫెస్టివ్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈ నెల 22వ తేదీన జరిగిన పోటీల్లో పాఠశాల సీనియర్ ఇంటర్ బైపీసీ విద్యార్థులు శివప్రియ, హెక్సిబ, విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. వీరికి ప్రశంసాపత్రంతో పాటు రూ.4వేలు నగదును అందజేశారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ రవినాయక్, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

కే-రిడ్జి స్కూల్‌లో ప్రపంచ పోలియో దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రొటేరియన్ షేక్ కరీమ్ మొహిద్దీన్, పక్కన స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట కే-రిడ్జి ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో ప్రపంచ పోలియో దినోత్సవం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. రోటరీ గవర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి, రోటేరియన్ షేక్ కరీమ్ మొహిద్దీన్, మునీధర్‌రెడ్డిలు మాట్లాడుతూ పోలియో ఉనికిని నిరోధించడం మనందరి బాధ్యత అన్నారు. రోటరీ క్లబ్ ఈ లక్ష్యాన్ని సాధించడానికి అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కేరిడ్జి ఇంటర్‌నేషనల్ స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ జీ బర్నబస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌ఈసీ కళాశాలలో విద్యార్థులకు వర్క్‌షాపు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైనింగ్ విజయవాడ ఆధ్వర్యంలో మెకానికల్ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. అనంతరం శిక్షణ ఇచ్చిన సిబ్బందిని ఎన్‌ఈసీ కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ ఇచ్చిన సిబ్బందిని సత్కరిస్తున్న ఎన్‌ఈసీ కళాశాల సిబ్బంది

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, పక్కన మక్కెన

వినుకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం పని చేస్తుందని చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. చీఫ్ విప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చి సమస్యలను జీవీ ఆంజనేయులుకు విన్నవించుకున్నారు. ప్రతి ఒక్కరి సమస్యను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపుతానని చీఫ్ విప్ జీవీ పేర్కొన్నారు. వినుకొండ పట్టణంతోపాటు గ్రామాల్లో సీసీ రోడ్లు, విద్యుత్తు, డ్రెయిన్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వివిధ వర్గాల ప్రజలు విన్నవించారు. ఫిర్యాదులను పరిశీలించిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సంబంధిత అ. దికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కూటమి పాలనలో ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని వివరించారు. కార్య క్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రేమిడిచర్ల గౌరీ శంకర్ దేవాలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గౌరీ శంకర్ దేవాలయంలో స్వామి వారు

బొల్లాపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో శ్రీ గంగా గౌరీ శంకర్ దేవాలయంలో శుక్రవారం స్వామి వారికి రుద్రాభిషేక అలంకరణ, ఓం నమఃశివాయ అలంకరణ, కార్తీక మాసం పతి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అలంకరణలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు రామకృష్ణ తెలిపారు. ప్రతిరోజు గోత్ర నామాలు, పూజా కార్యక్రమాలు, కార్తీక మాసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.


నాయుడుపాలెంలో గ్రామస్థులకు హార్ట్ ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్‌లపై అవగాహన కల్పిస్తున్న ఆస్టర్ రమేష్ హాస్పటల్ సిబ్బంది

హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన

బొల్లాపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెం, సంగినీడుపాలెం, సీతారామ్‌పురంతండా, వెల్లటూరు గ్రామాల్లో ఆస్టర్ రమేష్ హాస్పటల్ ఆధ్వర్యంలో ప్రజలకు హార్ట్ అండ్ బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడుతూ వినుకొండ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సహకారంతో ఈ నెల 26వ తేదీ ఆదివారం బొల్లాపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ శిబిరం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు జరుగుతుందన్నారు. సకాలంలో గుర్తించి నియంత్రించటం ద్వారా స్ట్రోక్, గుండె సంబంధిత వ్యాధులను నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాలని, శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులతో పాటు నరాలు, మోకాళ్ళ నొప్పులు, హార్ట్ అండ్ బ్రెయిన్, చిన్న పిల్లలకు సంబంధించిన అన్ని జబ్బులను పరీక్షించటం జరుగుతాయన్నారు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు అప్పగింత

నూజెండ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాల క్రితం తప్పిపోయిన వ్యక్తిని గుర్తించి ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు శుక్రవారం అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ మండలం నీలగంగారం గ్రామానికి చెందిన వంగళ్ళ శ్రీనివాసరావు 2022లో అత్తగారి ఊరైన మండలంలోని కంభంపాడు గ్రామానికి వెళ్లాడు. అత్తింటి వారి ధోరణిపై అసంతృప్తితో ఎవ్వరికీ సమాచారం ఇవ్వకుండా అదృశ్యమయ్యాడు. ఈ సంఘటనపై అతని తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశాడు. ఇటీవల ప్రత్యేక గాలింపు చర్యల్లో భాగంగా కేసుల పరిష్కార దిశగా ప్రత్యేకదృష్టి సారించిన ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావు వినుకొండ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో శ్రీనివాసరావును గుర్తించి ఆయన తండ్రి ఐన వెంకటేశ్వర్లుకు తెలియజేయగా తన కొడుకేనని నిర్ధారించాడు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులకు కన్పించకుండాపోయిన కొడుకు దొరకటంతో ఆనందం వ్యక్తం చేశారు.

వరి పంట దెబ్బతినకుండా సస్యరక్షణ చేయాలి

● మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి రామారావు

శావల్యాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరిపంట దెబ్బతినకుండా రైతులు ముందుగానే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, సకాలంలో సస్యరక్షణ చేయడంవల్ల పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఉంటుందని మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి రామినేని రామారావు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వరిపంట సాగుచేసిన రైతులు పొలాల్లో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలని, బ్యాక్టీరియా, ఎండు ఆకు తెగుళ్ళు ఆశించే అవకాశమున్నందున ప్లాంటమైసిన్ మందు 20గ్రాములు లీటరు నీటిలో కలిపి వారానికి రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. కాండం కుళ్లు తెగులు రాకుండా కార్బెండజిమ్, మ్యాంకోజెబ్ లేదా వాలిడామైసిన్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అగ్గితెగులు సోకినట్లుగా ఉంటే ట్రైసైక్లోజల్ మందు 0.6గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. బ్యాక్టీరియా, ఎండాకు తెగులు ఉంటే పంటకు నత్రజని వేయకూడదన్నారు. సలహాలు, సూచనలకు రైతులు రైతు సేవాకేంద్రాల్లో వీఏఏలను సంప్రదించాలన్నారు.